ఈనాడు సంగారెడ్డి

గురువారం 31 ఆగస్టు 2017 | 16 పేజీలు

లంబోదరుడికి 108 ప్రసాదాలు



సంగారెడ్డి పురపాలక సంఘంలోని మంజీరనగర్‌లో ప్రతిష్ఠించిన వినాయకుడికి కాలనీవాసులు భక్తి ప్రత్తులతో పూజలు చేస్తున్నారు. కాలనీలోని పార్కు స్థలంలో ఏర్పాటు చేసిన మండపంలో బుధవారం రాత్రి ఏకంగా 108 రకాల ప్రసాదాలు తయారు చేసి నైవేద్యంగా సమర్పించారు. ఒక్కో ఇంటి నుంచి ఒక్కో రకం ప్రసాదాన్ని తయారు చేసి తీసుకొచ్చారు. లంబోదరునికి ప్రసాదం సమర్పించడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు మహిళలు తెలిపారు. పూజల అనంతరం భక్తులకు పంపిణీ చేశారు.

–న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ

చట్టం.. కొందరి చుట్టమా!

ఒక్క కుటుంబానికే నిబంధనలు వర్తింపు ● మిగతా వారితో రెవెన్యూ అధికారుల కుమ్మక్కు? ● ఇప్పటికీ వారి పేర్లు పహాణీల్లో కొనసాగింపు

ఈనాడు, సంగారెడ్డి

ధైర్యంగా ప్రశ్నించలేని వారికి నిబంధనలు పక్కాగా వర్తిస్తాయి. అన్యాయాన్ని నిలదీసే వారు, ఎంతోకొంత ఇచ్చుకుంటామని ఆశ చూపే వారి విషయంలో మాత్రం అధికారులు ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తారు. అంతులేని ఉదారతను చూపి వారికి సర్వదా సహకరిస్తారు. సంగారెడ్డి మండలం ఫసల్‌వాదికి చెందిన వెంకట చలపతి ఆత్మహత్యతో రెవెన్యూ అధికారుల బాగోతం మరోసారి బట్టబయలైంది. వారిచ్చిన ఆదేశాలను కేవలం కొందరికే వర్తింపజేసిన వైనం వెలుగులోకి వచ్చింది. ఒక పేద కుటుంబానికి అన్యాయం చేసిన తీరుపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. అసైన్డు భూములను విక్రయించిన వారు, ఇళ్లస్థలాలుగా మార్చిన వారిని వదిలి ఒక నిరుపేద కుటుంబంపై తమ ప్రతాపాన్ని ప్రదర్శించడం ఎంత వరకు సమంజసమని వారు అడుగుతున్నారు.

అయిదుగురిపైనే ప్రతాపం...

ఈనెల 21న సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి పురుగుల మందును తాగి వచ్చి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వెంకటచలపతి మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ఘటన వెనక అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతా రాహిత్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఫసల్‌వాది గ్రామంలోని సర్వే సంఖ్య 599లో ఉన్న భూములను 1974 సంవత్సరంలో పేదలకు కేటాయించిన విషయంలో అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించారు. వెంకటచలపతి, ఆయన సోదరులు రఘుపతి, నాగేశ్వరరావు, తల్లి శారదాబాయి, ఇదే గ్రామానికి చెందిన కుమ్మరి నర్సింహులుతోపాటు మరో 21 మంది పేర్లతో ఉన్న 48.07 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుంటూ ఏప్రిల్ 2008లో ఒక ఆదేశమిచ్చారు. అయితే... 21 మంది జోలికి వెళ్లకుండా కేవలం వెంకట చలపతి కుటుంబసభ్యులతోపాటు కుమ్మరి నర్సింహుల పేర్లతో ఉన్న భూమిని మాత్రమే ప్రభుత్వానికి చెందినదిగా మార్చేశారు. అక్కడ ఈ భూమి ఇళ్ల స్థలాలకు చెందినదిగా పేర్కొన్నారు. ఇదే తీరున మిగతా 21 మంది పేర్లను తొలగించాల్సి ఉన్నా తాజా పహాణీల్లోనూ వారి పేర్లే ఉండటం గమనార్హం. వాస్తవానికి అసైన్డు భూములు స్వాధీనం చేసుకునే సమయంలో ఒకటికి రెండుసార్లు నిరుపేదలకు అవకాశమిచ్చి అప్పటికీ నిబంధనలు ఉల్లంఘిస్తే అప్పుడు మాత్రమే తీసుకోవాలి. కనీసం ఇక్కడ ఆ ప్రక్రియనూ పాటించలేదు.



వెంకటచలపతి కుటుంబసభ్యులు (పాతచిత్రం)

కుమ్మక్కుపై అనుమానాలు

కేవలం అయిదుగురికి చెందిన 6.20 ఎకరాలను మాత్రమే రికార్డుల్లో మార్చారు. వాస్తవానికి ఉన్నతాధికారుల ఆదేశం మేరకు నిర్ణయం తీసుకుంటే 26 మంది పేర్లతో ఉన్న 48.07 ఎకరాలనూ ఇదే విధంగా మార్చాలి. ఇప్పటి వరకు ఇది జరగలేదు. సాగు చేయడం లేదనే కారణాన్ని చూపి రెండు కుటుంబాల నుంచి భూములు లాగేసుకున్నారు. మిగతా వారి విషయంలో మాత్రం ఉదారంగా వ్యవహరించారు. కొందరి ఒత్తిళ్లకు ...మిగతా 7లో

అండగా ఉండటంలోనూ...

అసలే నిరుపేద కుటుంబం, ఆపై చలపతి ఆత్మహత్యతో అతడి భార్య, కూతురు దిక్కులేని వారయ్యారు. వీరిపై కరుణ చూపి న్యాయం చేయాల్సిన అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. రెండు పడక గదుల ఇళ్లను అందిస్తామని చెప్పి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికీ ఇంకా ఇళ్ల నిర్మాణమే చేపట్టలేదు. ఇవి ఎప్పుడు పూర్తవుతాయో కూడా తెలియదు. ఇలాంటి క్రమంలో బాధితులకు సత్వర న్యాయం చేసే దిశగా చర్యలుంటేనే బాధిత కుటుంబానికి అండగా నిలిచినట్లు అవుతుంది. సంగారెడ్డి ఆర్డీఓ వద్ద వీరికి సంబంధించిన కేసు అపరిష్కృతంగా ఉంది. కనీసం కార్యాలయాల చుట్టూ తిరిగే ఓపిక లేక చలపతి కుటుంబ సభ్యులు విచారణకు సైతం హాజరుకాలేకపోయారు. మరోవైపు తాజాగా రెవెన్యూ సమస్యలకు సంబంధించి పాలనాధికారుల కోర్టులను మినహా అన్నింటినీ రద్దు చేస్తామంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడంతో ఈ కుటుంబానికి న్యాయం జరగాలంటూ ఇక ఉన్నతాధికారులు కరుణ చూపాల్సిందే. ఇప్పటికైనా వారు దృష్టిసారిస్తే ఈ అభాగ్యుల కుటుంబానికి మేలు చేకూరుతుంది.

మత్స్యకారుల ప్రగతే లక్ష్యం

వచ్చే ఏడాది నుంచి కొరమీను విడుదల



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌యాదవ్, వేదికపై అందోలు ఎమ్మెల్యే బాబూమోహన్, సంయుక్త పాలనాధికారి వెంకటేశ్వర్లు

పుల్కల్, న్యూస్‌టుడే: మత్స్యకారుల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచి, వారి జీవన ప్రమాణాలను పెంచడానికి వచ్చే సంవత్సరం నుంచి నీటి వనరుల్లో కొరమీను చేపపిల్లలను విడుదల చేస్తామంటూ రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జలవనరుల్లో చేపపిల్లలను విడుదల చేసే కార్యక్రమానికి ఈ ఏడాది సింగూరు ప్రాజెక్టు నుంచి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా బుధవారం ఆయన తొమ్మిది లక్షల చేపపిల్లలను వదిలారు. అనంతరం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో... ప్రతి యేటా బొచ్చ, రోహు, మ్రిగాల రకాలను మాత్రమే వదులుతుండటంతో మత్స్యకారులకు ఆర్థికంగా సరైన ఫలితాలు లభించడంలేదని మంత్రి దృష్టికి స్థానిక ఎమ్మెల్యే బాబూమోహన్ తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ... సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామని, వచ్చే ఏడాది నుంచి కొరమీను పిల్లలను విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ప్రధానంగా సింగూరు ప్రాజెక్టుతోపాటు దాని ద్వారా నీటిని నింపుతున్న చెరువుల్లోకి కావాల్సినన్ని విడుదల చేస్తామన్నారు. రొయ్యల పెంపకాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం రొయ్యల పిల్లలను సైతం ఇస్తోందన్నారు. కేజ్ కల్చర్‌ను అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ఒక యూనిట్‌ను 80శాతం రాయితీపై ఇస్తున్నట్లు తెలిపారు. ఒక్కో యూనిట్ ధర రూ.30 లక్షలు ఉండగా అందులో లబ్ధిదారుడు 20 శాతం వాటాగా ...మిగతా 7లో

'అపరాలు' ఆగమాగం



తడిసిన పెసలు, మినుము పంటలు

తీవ్రంగా నష్టపోతున్న అన్నదాతలు

పూర్తిగా దెబ్బతిన్న పెసర పంటను తీస్తున్న రైతులు

న్యూస్‌టుడే, న్యాల్‌కల్

కీలకమైన కోత దశలో ఉన్న అపరాల పంటలకు వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో తీవ్ర నష్టం వాటిల్లింది. వాతావరణం అనుకూలిస్తే దిగుబడులు ఇంటికి చేరేవని... ఇప్పుడు నిస్సహాయ స్థితిలో ఉండిపోవాల్సిన పరిస్థితి నెలకొందని రైతన్నలు వాపోతున్నారు. మరోపక్క జహీరాబాద్‌లోని నారింజ ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో వరద ఉద్ధృతి రైతులకు మరింతగా నష్టాన్ని కల్గిస్తోంది. కోసిన పంటలు పొలాల్లోనే మొలకెత్తుతున్నాయి. తడిసిన పంట దిగుబడులకు విపణిలో ధర పలకడంలేదు. జిల్లాలోని పలు ప్రాంతాలతోపాటు జహీరాబాద్, బీదర్, వట్‌పల్లి, రాయికోడ్, నారాయణఖేడ్ వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన పెసర, మినుములకు అంతంత మాత్రమే ధర దక్కుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వేలాది రూపాయలను పెట్టుబడులుగా పెట్టినా... సరైన ...మిగతా 7లో

● ఆగస్టు 29న జహీరాబాద్ మండలం చిరాగ్‌పల్లి శివారులో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా డీసీఎంలో తరలిస్తున్న రూ.5 లక్షలు విలువ చేసే 60 తంబాకు బస్తాలు పట్టుబడాయి.

● వారం కిందట హైదరాబాద్‌లో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తూ బీదర్ నుంచి జంటనగరాలకు ఐదు వాహనాల్లో తరలిస్తున్న రూ. 30 లక్షలు విలువ చేసే గుట్కా, తంబాకును స్వాధీనం చేసుకున్నారు. ఇవి మచ్చుచు కొన్ని మాత్రమే...



జహీరాబాద్‌లో పోలీసులు స్వాధీనం చేసుకున్న గుట్కా (పాతచిత్రం)

రాష్ట్ర సరిహద్దుల్లో... గుప్పుమంటున్న అక్రమం!

గుట్టుగా గుట్కా, తంబాకు వ్యాపారం! ● కర్ణాటక- తెలంగాణ సరిహద్దు మీదుగా రవాణా ● సంగారెడ్డి, హైదరాబాద్‌కు నిత్యం సరఫరా

న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్

ప్రజల ఆరోగ్యమే ముఖ్యమంటూ ప్రభుత్వం నిషేధించిన గుట్కా, జర్దా, తంబాకు మాఫియా మళ్లీ కర్ణాటక, మహారాష్ట్రల సరిహద్దులోని జహీరాబాద్, నారాయణఖేడ్ డివిజన్‌లతోపాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో జులుం విదుల్చుతోంది. కొన్ని నెలలుపాటు స్తబ్దుగా ఉన్న వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది. బీదర్ నుంచి సరకు తెచ్చి కర్ణాటక- తెలంగాణ సరిహద్దులోని వ్యవసాయ క్షేత్రాలు, జహీరాబాద్ పట్టణం, మండల శివారు ప్రాంతాల్లోని రహస్య ప్రాంతాల్లో నిల్వ చేసి దందా కొనసాగిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. పోలీసులు, ఆహార నియంత్రణ ఆధీకృత విభాగం అధికారుల నిఘా సన్నగిల్లడంతో రోజుకు రూ. లక్షల్లో గుట్కా, తంబాకు వ్యాపారం సాగుతోంది. రాష్ట్ర సరిహద్దుతో పాటు జహీరాబాద్ ప్రాంతాల్లో గుట్కా మాఫియా వాటిని ఎక్కడ నిల్వ చేస్తారు, గోదాంలు ఎక్కడెక్కడ ఉన్నాయో ఆహార నియంత్రణ, పోలీసు అధికారులకు తెలుసన్నది బహిరంగ రహస్యమే. దీంతో గుట్కా తయారీ, హోల్‌సేల్ అక్రమార్కులు కోట్లకు పడగలెడుతున్నారు. కంటి తుడుపు చర్యగా దాడులు జరిపి గోరంతను కొండంతలు చూపిస్తూ అధికార గణం స్వకార్యాన్ని చక్కబెట్టుకొంటోంది.



బీదర్ నుంచి హైదరాబాద్ తరలిస్తున్న తంబాకు లోడును స్వాధీనం చేసుకున్న పోలీసులు (పాతచిత్రం)

శివారులోనే నిల్వ కేంద్రాలు!

తెలంగాణ- కర్ణాటక సరిహద్దు స్థావరంగా తయారీ, నిల్వ కేంద్రాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. కర్ణాటకలోని జిల్లా కేంద్రం బీదర్ పట్టణ శివారులోని జహీరాబాద్, న్యాల్‌కల్ మండలాల సరిహద్దులోని వ్యవసాయ క్షేత్రాల్లో తయారీ, నిల్వ కేంద్రాలు ఏర్పాటు చేసుకుని అక్రమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. బీదర్, జహీరాబాద్ ప్రాంతానికి చెందిన కొందరు వ్యాపారులు సిండికేట్‌గా శివారులోనే తయారీ కేంద్రాలు ఏర్పాటు చేసి ఏజెంట్ల సాయంతో రాత్రుళ్లు బహిరంగ మార్కెట్లకు తరలిస్తున్నారు. 2015 ఏప్రిల్ 24న జహీరాబాద్ మండలం రాయిపల్లి(డి) శివారులో తయారీ కేంద్రంపై పోలీసులు దాడి చేసి రూ. 30 లక్షల విలువైన గుట్కా ప్యాకెట్లు, ముడి సరకు, యంత్ర సామగ్రిని జప్తుచేసి ఇద్దరిని అరెస్టు చేశారు. 2015 జూలై 6న బీదర్ నుంచి జహీరాబాద్, హైదరాబాద్ ప్రాంతాలకు మీరజ్ తంబాకుతో వెళ్తున్న కంటేయినర్‌ను పోలీసులు పట్టుకుని రూ. 17 లక్షల విలువైన సరకును స్వాధీనం చేసుకున్నారు.

అడ్డదారుల్లో తరలింపు...

బీదర్ శివారుల్లో తయారు చేస్తున్న గుట్కా, తంబాకు జహీరాబాద్, సంగారెడ్డి, హైదరాబాద్‌కు అడ్డదారుల్లో తరలిస్తున్నారు. బీదర్ నుంచి న్యాల్‌కల్, డప్పూర్, ముంగీ కూడలి, రాయికోడ్, మునిపల్లి, సదాశివపేట మీదుగా సంగారెడ్డి, హైదరాబాద్‌కు రాత్రివేళల్లో చేరవేస్తున్నారు. బీదర్ నుంచి కర్ణాటకలోని బరూర్, జహీరాబాద్ మండలం బూచినెల్లి, బూర్దిపాడ్, తూంకుంట అటవి మార్గాల్లో డీసీఎం, బొలేరో పికప్, ట్రాలి ఆటోలలో నిల్వ కేంద్రాలకు రాత్రికి రాత్రి పంపుతున్నారు. రోజుకు లక్షల్లో అక్రమ వ్యాపారం కొనసాగుతుంది. ఒక్కో గుట్కా వ్యాపార కేంద్రంలో నిత్యం కనీసం రూ. 10 నుంచి రూ. 50 వేల వరకు అమ్మకాలు సాగుతుండటంతో రోజుకు సగటున రూ. 5 నుంచి రూ. 8 లక్షల వరకు వ్యాపారం నిర్వహిస్తున్నారు. పట్టణాల్లోని గల్లిగల్లిలోని పాన్‌షాపులు, కిరాణ కొట్టుల్లో గుట్కా లడీలను దాచిఉంచి అమ్ముతున్నారు. చర్యలు తీసుకునే అధికార యంత్రాంగం మాత్రం ఎస్పీ ఆదేశాలు అందిన రోజుమాత్రం దాడులు చేసి ప్యాకెట్లు దహనం చేసి సరిపెడుతున్నారు. అనంతరం తమపని చక్కబెట్టుకుని జేబులు నింపుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

తనిఖీలు ముమ్మరం చేస్తాం

– నల్లమల రవి, డీఎస్పీ జహీరాబాద్

గుట్కా, తంబాకు, జర్దా మాఫియాపై ఉక్కుపాదం మోపుతాం. రాష్ట్ర సరిహద్దులో తనిఖీలు ముమ్మరం చేస్తున్నాం. సమస్యను జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి చిరాగ్‌పల్లి, న్యాల్‌కల్ మండలంలోని అంతర్‌రాష్ట్ర రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనాలను తనిఖీ చేస్తున్నాం. ప్రస్తుతం బక్రీద్, వినాయక చవితి పర్వదినాల కోసం చెక్‌పోస్టులను ఏర్పాటు చేశాం. వాటిని ఏడాదిపాటు కొనసాగేలా చర్యలు తీసుకుంటాం. వ్యవసాయ క్షేత్రాల్లో తయారీ కేంద్రాలు, నిల్వలపై నిఘా పెట్టి అక్రమార్కులను అరెస్టు చేస్తాం.

3.60 కోట్ల చేప పిల్లల పంపిణీ

జిల్లా లక్ష్యాన్ని వివరించిన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్ యాదవ్, చిత్రంలో జడ్పీ అధ్యక్షురాలు రాజమణి, సంగారెడ్డి ఎమ్మెల్యే ప్రభాకర్

సంగారెడ్డి అర్బన్: గతంలో ఎన్నడూ లేని విధంగా చేతి వృత్తులకు అధికంగా నిధుల కేటాయింపులు చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కిందని మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం సంగారెడ్డి జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన జడ్పీ అధ్యక్షురాలు రాజమణి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌తో కలిసి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా రెండో విడతలో భాగంగా 3.60 కోట్ల చేప పిల్లలను పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. చేప పిల్లలను వదిలే లెక్కింపు తప్పనిసరి అని.. వీడియో రికార్డింగ్ చేయాలని, రాజీపడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. గొర్రెల పంపిణీ కార్యక్రమం దేశంలో ఎక్కడా అమల్లో లేదని చెప్పారు. త్వరలో నియోజకవర్గానికి ఒక్కటి చొప్పున సంచార వాహనాలు మంజూరు చేస్తామని, వీటిద్వారా పశువులకు మెరుగైన వైద్యం అందించనున్నట్టు తెలిపారు. ప్రతి పక్షాలు అభివృద్ధిని చూసి ఓర్వలేక అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. సంగారెడ్డి పట్టణానికి మత్స్య శాఖ తరపున మార్కెట్ సదుపాయం కోసం రూ. 50 లక్షలు, సదాశివపేటలో మార్కెట్ సదుపాయానికి రూ. 25లక్షలు మంజూరు అయ్యాయని వివరించారు. మత్స్యశాఖ మంత్రి శ్రీనివాస్‌యాదవ్‌ను జడ్పీ అధ్యక్షురాలు రాజమణి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెరాస కంది, సంగారెడ్డి మండలాల పార్టీ అధ్యక్షులు చిల్వేరి ప్రభాకర్, బైండ్ల అశోక్, పట్టణ అధ్యక్షుడు ఆర్. వెంకటేశ్వర్లు, పట్టణ కార్యదర్శి పెరుమాళ్ల నర్సింలు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు కాసాల రాంరెడ్డి, జిల్లా నాయకులు డాక్టర్ జి. శ్రీహరి, బి. రవి, లియాఖత్ అలీ, కసిని విజయ్‌కుమార్, శాగని హరికిషన్, కె. వి. శ్రీనివాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య


నాగల్‌గిద్ద: కుటుంబ కలహాలతో ఓ యువకుడు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన నాగల్‌గిద్ద మండల పరిధిలోని ఔదత్‌పూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. నాగల్‌గిద్ద ఎస్సై సందీప్, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... ఔదత్‌పూర్ గ్రామానికి చెందిన పవార్ నారాయణ(24)కు ఏడాది కిందట నారాయణఖేడ్ మండలం మాధ్వార్ తండాకు చెందిన మీరాబాయితో వివాహం జరిగింది. ఇటీవల నారాయణ మరో మహిళతో సన్నిహితంగా ఉంటూ.. ఆమెతో వివాహానికి ఏర్పాట్లు చేసుకున్నాడు. అది కుటుంబ సభ్యులకు తెలియడంతో వారు మంగళవారం నాగల్‌గిద్ద పోలీసులకు ఆశ్రయించారు. దీంతో మనస్తాపానికి గురైన నారాయణ బుధవారం శివారులోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నారాయణ తల్లి సోనిబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



చెట్టుకు ఉరివేసుకున్న పవార్ నారాయణ

వివాహిత ..

జహీరాబాద్ అర్బన్: బాల్యంలో తల్లిదండ్రులు మరణించిన తనను చేరదీసి పోషించి పెళ్లిచేసిన బాబాయి బస్వరాజు మృతితో మనస్తాపానికి గురైన వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. పట్టణంలోని శ్రీరాం వీధికి చెందిన సంధ్యారాణి(24) మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు చెప్పారు. మృతురాలికి రెండేళ్ల కుమారుడు, భర్త ఉన్నారని, మేనత్త జయశ్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.



గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పటాన్‌చెరు అర్బన్: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన ఇది. సీఐ ప్రభాకర్ కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం ముత్తంగికి చెందిన మోహన్‌రెడ్డి (52) అతని బంధువు అయిన భూపాల్‌రెడ్డి కలిసి పటాన్‌చెరు నుంచి ముత్తంగి గ్రామానికి ద్విచక్రవాహనంపై మంగళవారం రాత్రి వెళుతున్నారు. పోచారం కూడలి దాటాక జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనాన్ని నడుపుతున్న మోహన్‌రెడ్డికి తలకు బలమైన గాయాలు కావడంతో మృతి చెందారు. భూపాల్‌రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి.

విద్యుదాఘాతంతో ఒకరు..

గడ్డపోతారం, జిన్నారం: గడ్డపోతారం పారిశ్రామికవాడలోని ఓ రసాయన పరిశ్రమలో విద్యుదాఘాతంతో వెల్డర్ మృతి చెందినట్లు ఐడీఏ బొల్లారం ఎస్సై సాయిరాం తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన జోగిందర్ ప్రసాద్ గుప్త (49) మూర్తి అనే గుత్తేదారు వద్ద వెల్డర్‌గా పని చేస్తున్నాడు. విధుల్లో భాగంగా బుధవారం ఉదయం వెల్డింగ్ చేస్తుండగా ఇనుప బీమ్‌కు విద్యుత్తు సరఫరా అయినట్లు తెలిపారు. దీనిని గుర్తించిన పరిశ్రమ వర్గాలు బాధితున్ని సురారంలోని మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి రిమాండ్

పుల్కల్: రాయిపాడ్ గ్రామంలో చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం విలేకరులకు పోలీసులు వివరాలు వెల్లడించారు. రాయిపాడ్‌కు చెందిన మ్యాతరి లక్ష్మయ్య ఇంట్లో ఈ నెల 24న చోరీ జరిగింది. బాధితుడు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు అడివయ్యను అదుపులోకి తీసుకొని విచారించారు. ఆయన చోరీ చేసినట్టు అంగీకరించాడు. ఐదు తులాల బంగారం, రూ. 5వేల నగదును స్వాదీనం చేసుకొని.. నిందితుడిని రిమాండ్‌కు పంపినట్టు ఎస్సై తెలిపారు.

వేతనాలు చెల్లించాలని ఆందోళన

సంగారెడ్డి అర్బన్: జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పని చేస్తున్న ఒప్పంద కార్మికులకు వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేశారు. ఈ ధర్నానుద్దేశించి ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కరికె రాజయ్య మాట్లాడుతూ.. గత నాలుగు మాసాలుగా వేతనాలు లేకుండా సేవలందిస్తున్నారని చెప్పారు. వారికి ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆస్పత్రి ఆర్ఎంవో సంగారెడ్డితో సీఐటీయూ నాయకులు చర్చలు జరిపారు. ఆయన సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. యాదవరెడ్డి, మహబూబ్, నాగరాజు, శోభ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

సంగారెడ్డి అర్బన్: యువకుడు అదృశ్యమైన సంఘటన గ్రామీణ పోలీసుఠాణా పరిధిలో చోటు చేసుకుంది. గ్రామీణ ఎస్ఐ యాదవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కంది గ్రామంలోని లక్ష్మినగర్‌కు చెందిన మౌలనా కుమారుడు నవాజ్ (29) అదృశ్యమయ్యారు. ఈనెల 6న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. తండ్రి నవాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరోగ్యంపై 'రంగు' పడుద్ది

ఆకర్షించేలా ఆహార పదార్థాలపై పూతలు ● తింటే అనారోగ్యంపై దుష్పరిణామాలు ● నిర్లక్ష్యపు నీడలో తనిఖీ అధికారులు



ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లో ఎరుపు రంగు వేసి వేయించిన గోబి మంచూరియా



నాసిరకమైన కారం, మసాలాలు..

'ఇటీవల నగరంలో నిర్వహించిన ఓ ముఖాముఖీకి హాజరైన విద్యార్థుల్లో కొందరు విరామ సమయంలో ఆహారం తీసుకుందామని బయటకు వచ్చారు. నోరూరించే ఆహార పదార్థాలున్న ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌కు వెళ్లారు. ఇంకేముంది ఆకలితో ఉన్న వారంతా అక్కడకు చేరుకుని వివిధ రకాల రంగుల్లో ఉన్న పదార్థాలను ఆరగించారు. అప్పటి వరకు బాగానే ఉన్నా... సాయంత్రం ఇంటికి వెళ్లిన తర్వాత వారు అనుభవించిన కష్టాలు అన్నీఇన్నీ కావు. నాసిరకం వంటకమే దీనికి కారణం. ఇలాంటి ఘటనలు నిత్యం పదుల సంఖ్యలో జిల్లాలో ఎక్కడోచోట జరుగుతూనే ఉంటాయి.'

న్యూస్‌టుడే, కోహీర్

సంగారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాల్లోని ఫాస్ట్‌పుడ్ సెంటర్లు, హోటళ్లు, దాబాల్లో నాణ్యమైన ఆహారాన్ని అందించాలనే నిబంధనలు చెబుతున్నప్పటికీ లాభార్జనే ధ్యేయంగా భావించిన వాటి నిర్వాహకులు దీనిని పట్టించుకోవడం లేదు. పైపెచ్చు ఆహార పదార్థాలను ఆకర్షణీయంగా ఉంచేందుకు వివిధ రసాయనాలను వాడటంతో అవి కాస్త ప్రమాదకరంగా మారుతున్నాయి. ప్రధానంగా చికెన్, రైస్‌లో ఎర్రటి ముక్కలను చూడగానే ఎవరికైనా నోరూరుతుంది. కానీ వీటిని తయారు చేసే విధానాన్ని ఆ సమయంలో పట్టించుకోకపోవడం వారికి అవకాశంగా మారుతుంది. రోజుల తరబడి ఫ్రిజ్‌లో ఉంచిన మాంసంను వెనిగర్‌లో ముంచుతారు. దీనికి కొంత నాసిరకంగా ఉన్న పిండి, ఫుడ్‌కలర్ కలిపి నూనెలో వేయిస్తారు. దీంతో విక్రయాలు జోరందుకుంటాయి.

పొడులతో మరింత ప్రమాదం

ఫాస్ట్‌ఫుడ్‌ను కేవలం 3 నుంచి 9 నిమిషాల్లోనే పూర్తి చేయాలి. వీటికి రుచి రావాలంటే ఆహారాన్ని వేగంగా వేడి చేయాల్సి ఉంటుంది. దానికి రుచి కోసం పొడి(మోనో సోడియం గ్లూకోమెంటో)ని కలుపుతారు. ఇది తినడం ప్రమాదకరమని తెలిసినా ఆకలి వల్ల తినక తప్పనిస్థితి. ఈ చూర్ణం కడుపులోని పేగుల గోడలకు తీవ్ర నష్టం కలిగిస్తుంది. తద్వారా జీర్ణశక్తి తగ్గిపోయి అనారోగ్యం బారిన పడతారు.

నాసిరకం నూనెలతో క్యాన్సర్...

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో ఎక్కువగా పామాయిల్‌ను వినియోగిస్తున్నారు. ఒకసారి వేడిచేసిన నూనె మళ్లీ వాడకూడదు. కానీ వేడి చేసి చల్లార్చిన నూనెను మళ్లిమళ్లి వాడుతూ వాటితో రకరకాల వేపుళ్లు తయారు చేస్తున్నారు. వేడిచేసి చల్లార్చిన నూనెను మరలా వాడటంతో క్యాన్సర్ వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. మరోవైపు అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల నాసిరకం కారాన్ని వాడటం సర్వసాధారణమైంది. తక్కువ ధరలకే లభించడంతో వ్యాపారస్తులు దీన్ని వాడటానికే మొగ్గు చూపడంతో ప్రజల ఆరోగ్యం దెబ్బ తింటుంది.

ఆమ్లెట్‌లతో జర భద్రం....

హోటళ్లు, దాబాల్లో ఇతర ప్రదేశాల్లో వర్షాకాలం కావడంతో ఆమ్లెట్‌లను వేసుకుని వేడివేడిగా తినడానికి ప్రజలు ఆసక్తి చూపుతారు. ఆమ్లెట్ తయారు చేసేటప్పుడు గుడ్డును పగలగొట్టి వేస్తారు. గుడ్లను ఆరుబయటనే పెట్టడం ద్వారా దుమ్మూధూళి పడి, బ్యాక్టీరియా చేరి తద్వారా అనారోగ్యానికి దారి తీస్తుంది.

వంటకాల కడాయిని కడిగితే ఒట్టు....

ప్రతి రోజు ఆహార పదార్థాలను వేడిచేసే కడాయిని చాలా మంది నిర్వాహకులు కడగడం లేదు. వంటకాలు పూర్తికాగానే ఆ కడాయిని పాత గుడ్డతో తూడవడమే తప్ప... దానిని నీటితో శుభ్రం చేయడం లేదు. ఇలా రోజుల తరబడి వాడటం వల్ల కడాయికి పట్టిన నూనె వంటకాల్లో కలిసిపోతుంది. పరిసరాల పరిశుభ్రతను గాలికి వదిలేస్తున్నారు. వారు వినియోగించే వస్తువుల శుభ్రతపై శ్రద్ధ చూపడం లేదు. వాటిపై ఈగలు, దోమలు పాకుతున్నా పట్టించుకోవడం లేదు. తనిఖీలు నిర్వహించి దీనిని నియంత్రించాల్సిన అధికారులు, తగినంత మంది సిబ్బంది లేకపోవడంతో ఇటువంటి పరిస్థితి నెలకొంది.



కాచి చల్లార్చిన నూనెను మళ్లీ వేడి చేసి సమోసాలు చేస్తున్న హోటల్ నిర్వాహకుడు

ఇలాంటి ఆహారానికి దూరంగా ఉండాలి

– శ్రీధర్, మండల వైద్యాధికారి

తక్కువ ధరకే వస్తుందన్న ఆశతో బజారులో వండే ఆహార పదార్థాలు తింటే అనారోగ్యం కలగకున్నా జీర్ణాశయంపై ప్రభావం చూపుతుంది. ఇంట్లో వండిన పదార్థాలే ఆరోగ్యానికి మేలు. అత్యవసరమైనప్పుడు ప్రజలు కనీస నియమాలు పాటించే హోటళ్లు, దాబాలు, పాస్ట్‌ఫుడ్ సెంటర్లలో మాత్రమే ఆహారం తీసుకుంటే మంచిది.

ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తాం

– విజయ్‌కుమార్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల ఫుడ్ ఇన్‌స్పెక్టర్

సమస్యను ఉన్నతాధికారులకు నివేదించి సమస్యాత్మకమైన ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపడతాం. కోహీర్ మండలంలో నాసిరకంగా ఆహార పదార్థాలు తయారు చేస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. వీలయినంత త్వరలో హోటళ్లు, దాబాలు, మిఠాయి దుకాణాలు, పాస్ట్‌ఫుడ్ సెంటర్లతో తనిఖీలు నిర్వహిస్తాం. శాఖలో తగినంత మంది సిబ్బంది లేకపోవడంతో తనిఖీలు పోలీసు శాఖ సహాయంతో నిర్వహించాల్సి వస్తుంది. రెండు జిల్లాలకు ఒక్కడినే అయినందువల్ల పనుల్లో జాప్యం జరుగుతుంది. సిబ్బంది కొరత చాలా వేధిస్తుంది.

మార్పులకు అనుగుణంగా విద్య కొనసాగింపు

సరస్వతి విద్యాపీఠం దక్షణమధ్య క్షేత్ర సేవాప్రముఖ్



మాట్లాడుతున్న కుందూరు విద్వాన్‌రెడ్డి

నారాయణఖేడ్: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యను అందించేందుకు సరస్వతి శిశు మందిరాల ద్వారా కృషి చేస్తున్నామని సరస్వతి విద్యాపీఠం దక్షణమధ్య క్షేత్ర సేవాప్రముఖ్ కుందూరు విద్వాన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన ఖేడ్ శిశుమందిరాన్ని సందర్శించిన సందర్భంగా పాఠశాల కమిటీ బాధ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో 320 శిశు మందిరాలు కొనసాగుతుండగా 29 వేల మంది విద్యను అభ్యసిస్తున్నారన్నారు. విద్యావిధానంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా ఆంగ్ల మాధ్యమాన్ని సైతం ఏర్పాటు చేశామన్నారు. ప్రబంధకారిణి అధ్యక్షులు మునిగ్యాల మాణిక్‌ప్రభు, కార్యదర్శి డాక్టర్ శివకుమార్, సమితి అధ్యక్షుడు దొండీరావు, బీఎంఎస్‌రాష్ట్ర నాయకులు రాఘవులు, విద్యాపీఠం ప్రతినిధి జ్ఞానేశ్వర్, ప్రబంధకారిణి బాధ్యులు త్యార్లవీరయ్య, వీరేశం, కృష్ణమూర్తి, మధుసూదన్‌రెడ్డి, ప్రధానాచార్యులు సంజీవరెడ్డి పాల్గొన్నారు.

విరమణ ప్రయోజనాలు వర్తింపజేయాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజయ్య



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు

జహీరాబాద్ అర్బన్: అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు ఉద్యోగ విరమణ ప్రయోజనాలను ప్రభుత్వం వర్తింపజేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజయ్య డిమాండ్ చేశారు. అరవై ఏళ్లు పైబడిన కార్యకర్తలు, సహాయకులకు ఉద్యోగ విరమణ వర్తింపజేస్తామనే ప్రభుత్వ ప్రకటనను నిరశిస్తూ జహీరాబాద్‌లో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వరకు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విరమణ పొందే కార్యకర్తలకు రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరకులను రేషన్ దుకాణాల నుంచి సరఫరా చేసేందుకు జారీ చేసిన జీవో 14ను రద్దు చేయాలన్నారు. ఈ సంద్భరంగా డిమాండ్లతో కూడిన పత్రాన్ని డీఐవో ప్రభులుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యాక్షుడు మహిపాల్, అంగన్‌వాడీ కార్యకర్తలు శోభ, గౌరమ్మ, పద్మ, మల్లమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

జీవితాలకు భరోసా కల్పించాల్సిందే



ఉద్యోగ ఐకాస ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీ

సంగారెడ్డి అర్బన్: నూతన పింఛన్ విధానం రద్దు చేసి, ఉద్యోగుల కుటుంబాలకు భరోసా కల్పించాలంటూ టీఎన్‌జీఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్ డిమాండ్ చేశారు. బుధవారం సంగారెడ్డిలోని కలెక్టరేట్ నుంచి కొత్త బస్టాండ్ వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ... ప్రస్తుతం అమలవుతున్నది 'న్యూ పెన్షన్ స్కీం కాదని.. నో పెన్షన్ స్కీమ'ంటూ వాపోయారు. ఈ నూతన విధానాన్ని రద్దు చేయడానికి కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని కోరారు. సీపీఎస్ విధానంలో చేరిన ఉద్యోగుల్లో తెలంగాణలో ఇప్పటివరకు రెండు వేల మంది మృతి చెందారని, వారికి పింఛన్, ఇతరత్రా సౌకర్యాలు అందడంలేదని ఆరోపించారు. గత పదమూడేళ్లుగా టీఎన్‌జీఓ సంస్థ ఉద్యమం చేస్తోందని గుర్తుచేశారు. 19 సార్లు సామూహిక సెలవులు పెట్టామని, పలుమార్లు దిల్లీలోని జంతర మంతర్ వద్ద ధర్నాలు చేశామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం దిగిరావడం లేదని మండిపడ్డారు. సెప్టెంబర్ 1న భోజన విరామ సమయంలో... నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన కార్యక్రమాలు చేసేందుకు ఉద్యోగులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. రెవెన్యూ సంఘం జిల్లా అధ్యక్షులు వై.శివప్రసాద్, టీఎన్‌జీఓ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వి.రవి, టీఎన్‌జీఓల సహాధ్యక్షుడు సుశీల్‌బాబు, కోశాధికారి ఎం.నర్సింహులు, నాయకులు జావిద్‌అలీ, పర్వతాలు, వైద్యనాథ్, గౌస్, నాగరాజు, రవికుమార్, కొండల్, ఆంజనేయులు, దేవదాస్, జగన్, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు

హలో ఈనాడు



సమస్యలను తెలియజేయాల్సిన ఫోన్ నంబర్లు

పటాన్‌చెరు	: 8008573228
పటాన్‌చెరు అర్బన్	: 8008573229
రామచంద్రాపురం	: 7093981590
జిన్నారం	: 8008573231
గుమ్మడిదల	: 8008573232

న్యూస్‌టుడే, పటాన్‌చెరు అర్బన్:

సమస్య : పటాన్‌చెరు శ్రీరాంనగర్‌కాలనీలో పైపులైను నిర్మాణంలో భాగంగా గుంతలు తవ్వి అలానే వదిలేశారు.
–జనార్దన్, శ్రీరాంనగర్‌కాలనీ

● **సమాధానం:** త్వరలోనే పూడ్చేలా చర్యలు తీసుకుంటాం.
–హనుమంతు, పైపులైను నిర్మాణ పర్యవేక్షకులు

సమస్య : పటాన్‌చెరు యాక్సిస్‌బ్యాంకు వెనుక భాగంలో ఉన్న రహదారిలో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు.–హైమద్, మార్కెట్‌రోడ్డు

● **సమాధానం:** విద్యుత్తు దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం.
–నాగులు, విద్యుత్తు సరఫరా పర్యవేక్షకుడు

సమస్య : పటాన్‌చెరు వెంకటేశ్వర కాలనీలో రహదారిపైకి చెత్తరావడంతో ఇబ్బంది పడుతున్నాం.
–రమేష్, వెంకటేశ్వరకాలనీ

● **సమాధానం:** చెత్తను ఎత్తించి స్థానికులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం.
–ఆంజనేయులు, పారిశుద్ధ్యపర్యవేక్షకుడు

చిన్నారుల ఆరోగ్యంపై జాగ్రత్త తప్పని సరి

పటాన్‌చెరు: పాఠశాలల్లో చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందని పటాన్‌చెరు మండలం పాటి గ్రామ సర్పంచి రాములు యాదవ్ అన్నారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ పాఠశాలలో రుబెల్లా టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కాలుష్య ప్రభావిత గ్రామాలు పెరుగుతున్నాయని అన్నారు.

తీరు మారేనా?

☛ ఓటర్ల జాబితాపై రెవెన్యూ అధికారుల కసరత్తు

☛ అస్తవ్యస్త విధానాలకు తెరపడుతుందని ఆశాభావం



ఐడీఏ బొల్లారంలో ట్యాబ్‌లలో ఓటర్ల వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

న్యూస్‌టుడే, జిన్నారం:

జిన్నారం మండలంలో ఐడీఏ బొల్లారం రాజకీయాలకు కేంద్రం. ఎన్నికల సమయంలో ఇక్కడి ఓటర్లే కీలకంగా మారుతారు. గతంలో పోలింగ్ కేంద్రాల తీరు అస్తవ్యస్తంగా ఉండేది. ఒక్కో ఓటరుకు రెండు మూడు పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటు ఉండటం, కేంద్రం కూడా అందుబాటులో లేకపోవటంతో చాలా ఇబ్బందులు ఎదురయ్యేవి. ఓటర్లను అధికారులు ఎన్ని రకాలుగా చైతన్యం చేసినా 60 శాతానికి మించి ఎప్పుడూ పోలింగ్ నమోదు కాలేదంటే దానికి కారణం అస్తవ్యస్త పరిస్థితులేనని చెప్పవచ్చు. 28 పోలింగ్ కేంద్రాలు, 24 వేల ఓటర్లు ఉన్న జిన్నారం మండలం ఐడీఏ బొల్లారంలో తీరు మారేనా? అని స్థానికులు ఆశగా చూస్తున్నారు.

ప్రయోగాత్మక చర్యతో...

ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆన్‌లైన్‌లో చేయటానికి నూతన విధానాన్ని ఎన్నికల సంఘం చేపట్టింది. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు, సంగారెడ్డి నియోజకవర్గాలను ఎంపిక చేశారు. ఇందులో ఇప్పటికే ఉన్న ఓటర్ల జాబితాను ఆన్‌లైన్ చేశారు. దీంతో పోలింగ్ కేంద్రాల వారీగా బూత్‌స్థాయి అధికారులు ఇంటింటికీ తిరిగి ఓటరు నమోదు కార్యక్రమాన్ని ట్యాబ్‌ల ద్వారా ఆన్‌లైన్ చేస్తున్నారు. ఒక వ్యక్తికి ఒకే ఓటు పద్ధతిని అమలు చేయటానికి ప్రస్తుత విధానం బాగానే తోడ్పడుతుందని అధికారులు అంటున్నారు. ఐడీఏ బొల్లారంలో 28 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వాటిని గూగుల్ మ్యాప్ ద్వారా విభజించి చిత్రీకరించారు. ఓటును నమోదు చేసే అధికారి ఆ పోలింగ్ కేంద్రం పరిధిలో ఉండి పేర్లు నమోదు చేయటం, తొలగించడం, ఉన్నవి సరైనవేనని గుర్తించటం వంటివి చేయాలి. దీనిని బట్టి ప్రతి ఓటరు ఇంటికి బూత్‌లెవల్ అధికారి వెళ్లాల్సిందే. ఇదే సమయంలో ఒకే వ్యక్తికి ఒకటికి మించి ఓటు ఉన్నా.. ఆన్‌లైన్ అంగీకరించదు. ఇలాంటి కీలకమైన పనుల్ని తాజాగా అధికారులు పూర్తి చేస్తున్నారు. త్వరలో ఇది ఒక కొలిక్కి రానుంది.



విభజించిన పోలింగ్ కేంద్రాల తీరును చూపుతున్న అధికారులు

తీరు మారవచ్చు...

గతంలో అనేక బోగస్ ఓట్లు జాబితాలో ఉండేవి. ఓటర్లకు అందుబాటులో పోలింగ్ కేంద్రాలు ఉండేవి కావు. ఇప్పుడు చేస్తున్న నూతన విధానంతో ఓటరు నివసించే ప్రాంతానికి సమీపంలోనే పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. దీంతో ఓటింగ్ శాతం కూడా పెరుగుతుందని అంటున్నారు. అయితే కొన్ని సాంకేతిక సమస్యల వల్ల ఐడీఏ బొల్లారంలో ప్రక్రియ ముందుకు సాగటం లేదని సిబ్బంది అంటున్నారు. దీనిపై ఇప్పటికే సమస్యను ఉన్నతాధికారులకు నివేదించినట్లు అధికారులు చెప్పారు.

సమస్య ఉండదు... : కె శివకుమార్, తహసీల్దార్

ఇప్పటి దాకా ఉన్న గందరగోళం ఓటరు జాబితాలో ఇక కనిపించదు. అంతా పక్కాగా ప్రక్రియను నిర్వహిస్తున్నాం. ఆలస్యమైనా గతంలో ఉన్న అస్పష్టత కనిపించదు. గ్రామాలలో చాలా వరకు ఓటరు నమోదు కార్యక్రమం పూర్తి అయింది. ఐడీఏ బొల్లారంలోనే మిగిలి ఉంది.

కాలనీ సమస్యలు పరిష్కరించాలి



సమీక్ష చేస్తున్న అధికారులు

రామచంద్రాపురం రూరల్: వర్షాల మూలంగా మురుగునీటి పైపులైన్‌ల లీకేజీలు ఎక్కువగా ఏర్పడుతున్నాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం భారతీనగర్ డివిజన్ పరిధి వార్డు కమిటీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రహదారులు కొట్టుకుపోయాయని చెప్పారు. గుంతలమయంగా మారడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. వీధి దీపాల విషయంలో తగు చర్యలు తీసుకోవాలని కోరారు. పార్కుస్థలాల చుట్టూ రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. రాత్రి సమయాల్లో తాగుబోతులకు అడ్డాలుగా మారుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ సంగప్ప, కార్పొరేటర్ సింధూ ఆదర్శరెడ్డి, ఖాజా, యూసుఫ్, నర్సింహ, వెంకటరెడ్డి, కృష్ణయ్య, వెంకటరావు, వేణు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

పటాన్‌చెరు అర్బన్: ఓబీసీలకు న్యాయంగా దక్కాల్సిన నిధులు వెంటనే మంజూరు చేయాలని భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు డిమాండ్ చేశారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఓబీసీలకు చెందాల్సిన సబ్సిడీలు కూడా అందజేయాలని అన్నారు. కార్యక్రమంలో భాజపా జిల్లా అధ్యక్షులు బుచ్చిరెడ్డి, ఓబీసీమోర్చా జిల్లా అధ్యక్షులు నర్సింహులు, ప్రధానకార్యదర్శి సత్యనారాయణ, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు విష్ణు, మోహన్‌గౌడ్, రాజన్‌సింగ్ పాల్గొన్నారు.

కాలనీల్లో మౌలిక సదుపాయాలకు కృషి

రామచంద్రాపురం రూరల్: కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు చేపడుతున్నామని కార్పొరేటర్ సింధూ ఆదర్శరెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం భారతీనగర్ డివిజన్ పరిధి ఎంఐజీ కాలనీలో రూ.10లక్షలతో నిర్మించతలపెట్టిన భూగర్భ మురుగు నీటిపారుదల పైపులైన్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలనీల్లో అన్ని రకాల సదుపాయాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పాతబడిన పైపులైన్ వ్యవస్థను మార్చాల్సిన అవసరం ఉందని వివరించారు.

ప్రకృతి ఒడిలో... ఖాజీపల్లి



చెట్ల మధ్య ఖాజీపల్లి గ్రామం

ఖాజీపల్లి, జిన్నారం : ఖాజీపల్లి గ్రామం ఎగువన ఖాజీచెరువు, పక్కన దర్మిచెరువు, దిగువ భాగాన గండి చెరువు, మరో పక్క ఎత్తైన గుట్టలు, చుట్టూ పంట పొలాలతో కళకళలాడుతుంది. ప్రకృతి ఒడిలో జిన్నారం మండలంలోని ఖాజీపల్లి గ్రామం ఉంది. ప్రస్తుతం వర్షాకాలం కావటంతో గ్రామంలో ఎటు చూసినా... పచ్చని పొలాలు, చెట్లతో రమణీయంగా ఆకుపచ్చని తోరణాలు కట్టినట్లు కనిపిస్తోంది. ఇలాంటి దృశ్యాలు కొనసీమలో కనిపిస్తాయని అంటారు పారిశ్రామిక వేత్తలు. ఔటర్ రింగురోడ్డుకు ఆనుకొని ఉన్న ఈ గ్రామానికి అన్ని రకాలుగా ప్రకృతి సంపద కనిపిస్తుంది. అయితే ఎగువ భాగాన ఉన్న గడ్డపోతారం, ఖాజీపల్లి పరిశ్రమల వల్ల గ్రామం పూర్తిగా రసాయనాల కంపుతో మునిగి పోయింది. దాదాపు 5 లక్షల జనాభా ఉండే ప్రాంతంలో వెలువడాల్సిన రసాయనాలు, వాటి ప్రభావం.. కేవలం 2500 జనాభా ఉన్న ఖాజీపల్లిలో కనిపిస్తుందని విజయ్ అనే కేంద్రీయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఆయన గ్రామంలో కాలుష్య ప్రభావంపై పరిశోధన చేశారు. ప్రస్తుతం గ్రామానికి వచ్చే జల వాయు కాలుష్యాన్ని కట్టడి చేయటంతో పాటు చుట్టూ ఉన్న కొండలను కంకర క్వారీలకు ఇవ్వకుండా పరిరక్షించే ఏర్పాట్లు చేస్తే హైదరాబాద్‌కు ఆనుకొని ఉన్న ప్రకృతి అందాల పల్లె ఖాజీపల్లిని రక్షించుకోవచ్చు. నిపుణులు ఇదే చెబుతున్నారు. భావితరాల వారికి ఈ గ్రామాన్ని నాటి స్మృతుల కింద చూపవచ్చని పర్యావరణ వేత్తలు అంటున్నారు.



ఖాజీపల్లికి ఆనుకొని గండిచెరువు, పొలాలతో కళకళ

సమ్మె జయప్రదానికి పిలుపు

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: సెప్టెంబరు 19న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున్ కోరారు. పటాన్‌చెరు పారిశ్రామికవాడలోని ఐలా భవన్‌లో నిర్వహించిన కార్మికసదస్సులో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాలపరిమితి ముగిసిన జీఓలను వెంటనే సవరించాలని అన్నారు. కనీస వేతనం రూ.18 వేలు, కరవుభత్యం ప్రతి పాయింటుకు రూ.10.50 చొప్పున నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్రకమిటీ సభ్యులు పాండు రంగారెడ్డి, జిల్లా అధ్యక్షులు నర్సింహారెడ్డి, సహాయకార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సామూహిక సెలవు పెట్టిన ఉపాధ్యాయులు

గుమ్మడిదల: సీపీఎస్ విధానం ఉపాధ్యాయ, ఉద్యోగుల పాలిట శాపంగా మారిందని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజారెడ్డి విమర్శించారు. బుధవారం గుమ్మడిదలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ... సీపీఎస్ విధానాన్ని నిరసిస్తూ సెప్టెంబరు 1న ఉద్యోగ, ఉపాధ్యాయులందరు సంఘాలకు అతీతంగా సామూహికంగా సెలవు పెట్టుకోవాలన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రతినిధులు దామోదర్, రాంరెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌బీఐలో ఆధార్ సేవా కేంద్రం

గుమ్మడిదల: భారతీయ స్టేట్ బ్యాంకు, గుమ్మడిదల శాఖలో ఆధార్ సేవాకేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు శాఖ మేనేజరు లక్ష్మీ జయంతి తెలిపారు. ఈ నెల 31న ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేస్తామన్నారు.

పటాన్‌చెరు

కూరగాయల ధరలు

పటాన్‌చెరు అర్బన్: దోసకాయ రూ.40, దొండకాయ 40, బంగాళ దుంప 16, చామదుంప 35, టమాట 50, బెంగళూరువంకాయ 40, వంకాయ 40, తెల్లవంకాయ 40, క్యాబేజి(ఒకటి)30, క్యాలిఫ్లవర్(ఒకటి) 30, గోకరకాయ 40, క్యాప్సికం 50, పచ్చిమిర్చి 50, బెండకాయ 30, కాకరకాయ 30, చిక్కుడుకాయ 40, బీరకాయ 40, కీర 30, క్యారెట్ 50, బొబ్బరికాయ 30, బీన్స్ 40, సొరకాయ 15, బీట్‌రూట్ 40, నిమ్మకాయలు(6) రూ.10.



శాంతినగర్‌లో వినాయకమండపంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే



బొంతపల్లిలో..



కిష్టారెడ్డిపేటలో గణపతి మండపంలో నాయకుల పూజలు

గణనాథులకు ఘనంగా పూజలు

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: పటాన్‌చెరు పట్టణంలో వినాయకనవరాత్రులు జరుగుతున్నాయి. పట్టణ పరిధిలో గౌతంనగర్ కాలనీలో వినాయకఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని వద్ద లక్ష గరిక పూజను 108 జంటలతో నిర్వహించారు. మండపం భక్తులతో కోలాహలంగా మారింది. శాంతినగర్‌కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుని వద్ద ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో రామచంద్రాపురం ఎంపీపీ యాదగిరియాదవ్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు బసవేశ్వర్, మాజీ కార్పొరేటర్ సఫాన్‌దేవ్, తెరాస పట్టణ అధ్యక్షులు విజయ్, వినోద్‌రెడ్డి, భూకైలాస్, ఆంజనేయులు, రవి, తరమ్, సంతోష్ పాల్గొన్నారు.

గుమ్మడిదల: వినాయక నవరాత్రుల సందర్భంగా మండపాల వద్ద సందడి నెలకొంది. గుమ్మడిదల, కానుకుంట, అన్నారం తదితర గ్రామాలలో వినాయక నవరాత్రులను పురస్కరించుకుని నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అన్నారం ఆంజనేయస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి పూజలు చేశారు. సర్పంచి తిరుమలవాసు, ఉపసర్పంచి రాజు, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు వీరారెడ్డి, మాజీ సర్పంచి జైశంకర్‌గౌడ్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. గుమ్మడిదల జై హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద అన్నదానం నిర్వహించారు. నిర్వాహకులు ప్రభాకర్, శివకుమార్, తిరుపతిరెడ్డి, విఠల్, రమేశ్, శ్రీశైలం ఏర్పాట్లను పర్యవేక్షించారు. బొంతపల్లిలో గణనాథుల మండపాలల్లో సాయంత్రం సందడి కనిపిస్తుంది.

అమీన్‌పూర్: అమీన్‌పూర్ మండల పరిధిలో గణపతి నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయి. వినాయక మండపాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బీరంగూడ జయలక్ష్మినగర్ కాలనీలోని శ్రీలక్ష్మిగణపతి దేవాలయంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో వినాయక మహాపడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు అంజయ్య యాదవ్, సింధూ ఆదర్శరెడ్డి, శంకర్‌యాదవ్‌లు పాల్గొన్నారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణపతి మండపాల్లో మెదక్ పార్లమెంటు యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు



సంతోష్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కిరణ్ కుమార్, మెదక్ పార్లమెంటు కార్యదర్శి సుమన్‌రెడ్డి, నాయకులు వీరేష్, మహేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

గుమ్మడిదల: చిన్నారులు ఏర్పాటు చేసిన చిన్న గణనాథుడిని కారుపై ఉంచి ఊరేగించారు. విగ్రహం కదలకుండా ఉండేలా ఏర్పాటు చేసి గ్రామంలో ఊరేగిస్తూ స్థానికంగా ఎర్రచెరువులో నిమజ్జనం చేశారు.

రామచంద్రాపురం రూరల్: గ్రామాల్లో గణేష్ నవరాత్రుల ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు పూజలు నిర్వహిస్తున్నారు. పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అన్నదానం కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. బండ్లగూడ గ్రామం సంతోషిమాత ఆలయం వద్ద ఎంపీపీ యాదగిరి యాదవ్ అన్నదానం నిర్వహించారు. శివయూత్ అసోసియేషన్ వారు నిర్వహిస్తున్న గణేష్ విగ్రహం వద్ద జరిగిన పూజల్లో సర్పంచి ముత్యాలమ్మ పాల్గొన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు ఖలీదాబేగం, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు. తెల్లాపూర్, ఉస్మాన్‌నగర్, కొల్లూరు, ఈదులనాగులపల్లి, వెలిమెల గ్రామాల్లో సైతం స్థానిక యువజన సంఘాలకు చెందిన సభ్యులు వైభవంగా స్వామివారి పూజలు జరిపారు. కార్పొరేటర్లు అంజయ్యయాదవ్, సింధూ ఆదర్శరెడ్డి మండపాల్లో జరుగుతున్న పూజలకు హాజరు అవుతున్నారు.

జిన్నారం: గ్రామాలు, కాలనీల్లో గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. మండపాల వద్ద నిత్యం సందడి నెలకొంది. ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నదానాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి సందడి చేస్తున్నారు. ప్రధానంగా యువజన నేతల హడావిడి అంతా ఇంతా కాదు. మండపాల నిర్వాహకుల విజ్ఞప్తి మేరకు మండల నేతలు పూజలు చేస్తున్నారు. బుధవారం కిష్టాయపల్లిలో ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర కార్యదర్శి బశెట్టిగారి రాజు కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేశారు. నవరాత్రులు నిర్వహించుకోవాలని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు ఇవ్వొద్దని సూచించారు. మాధవరంలో పలు యువజన సంఘాలు ఏర్పాటు చేసిన మండపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్థానిక సర్పంచి సురేందర్‌గౌడ్, విద్యార్థి ఐకాస నియోజకవర్గ అధ్యక్షుడు విజయ్ కుమార్‌గౌడ్‌లు పూజలు నిర్వహించారు.



ఉత్సవాల్లో సర్పంచి జయమ్మ



మాధవరంలో నవరాత్రుల్లో పాల్గొన్న యువకులు



గుమ్మడిదలలో జై హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో...

పాత పింఛన్ విధానం కొనసాగించాలి

పటాన్‌చెరు: ప్రభుత్వం పాత పింఛన్ విధానం కొనసాగేటట్టు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు కోరారు. ఈ మేరకు నిరసన తెలపడానికి వీలుగా వచ్చే నెల ఒకటవ తేదీన సామూహిక సెలవు పెడుతూ.. పత్రాన్ని ఎంపీడీఓ అనంతరెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో శ్రీధర్, శ్రీకాంత్, సంజయ్‌కుమార్, హరిశంకర్‌గౌడ్, రిజ్వాన్, రవి పాల్గొన్నారు.

కులవృత్తులపై గౌరవంతో చేయూత

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: కులవృత్తులపట్ల గౌరవంతో అన్ని కులసంఘాలకు సంక్షేమ పథకాల ద్వారా ముఖ్యమంత్రి కేసీఆర్ చేయూత నిస్తున్నారని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు పట్టణంలో యాదవసంఘ సభ్యులకు కార్పొరేటర్ శంకర్ యాదవ్‌తో కలిసి గొర్రెల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పటాన్‌చెరు పట్టణంలో 37 యూనిట్లకు గొర్రెల పంపిణీ చేశామని తెలిపారు. లబ్ధిదారులు గొర్రెలను చక్కగా పెంచుకోవాలని, వాటికి సకాలంలో టీకాలు వేయించుకోవాలని తద్వారా రోగాలు రాకుండా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు పుష్పానగేష్, ఉపాధ్యక్షులు బసవేశ్వర్, ఎంపీపీ శ్రీశైలం యాదవ్, ఆత్మకమిటీ ఛైర్మన్ కుమార్‌గౌడ్, గొర్రెల సంఘం ప్రెసిడెంట్ మల్లేష్‌యాదవ్, ఉపాధ్యక్షులు రాజుయాదవ్, వెంకటేష్ యాదవ్, దేవయ్య, నర్సింహులు యాదవ్, యాదగిరి, వెటర్నరీ ఏడీ శేఖర్, జేఏఈ బుచ్చయ్య, తెరాస పట్టణ అధ్యక్షులు విజయ్, వీరేశం, కుమార్ యాదవ్, నవీన్‌రెడ్డి, భిక్షపతి, అబ్బుల్, ఎంపీటీసీ సభ్యుడు అంతిరెడ్డి పాల్గొన్నారు.

ఎంఎంటీఎస్ సమయాలు



పటాన్‌చెరు అర్బన్: (ఆదివారం రోజు వేళల్లో మార్పులు తప్పనిసరి)

లింగంపల్లి నుంచి ఫలక్‌నూమా: 4.25, 05.55, 6.30, 7.05, 7.45, 8.23, 9.00, 9.25, 10.05, 10.45, 11.30, 12.00, 12.40, 13.10, 13.20, 14.30, 14.50, 15.45, 16.08, 16.25, 17.05, 17.35, 18.10, 18.35, 19.15, 19.38, 20.20, 20.45, 21.10, 21.45, 22.25 (చివరిది సికింద్రాబాద్ వరకూ మాత్రమే)

లింగంపల్లి నుంచి హైదరాబాద్ : 5.25, 5.50, 6.38, 7.20, 8.00, 8.43, 9.19, 9.55, 10.29, 11.05, 11.48, 12.30, 13.05, 15.00, 16.13, 17.15, 18.09, 18.40, 19.01, 19.55, 21.00, 21.55, 22.45

కళాశాల నిర్వహణకు దుకాణ సముదాయం



పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీకళాశాల వద్ద దుకాణ సముదాయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: డిగ్రీకళాశాల నిర్వహణ కోసం ప్రత్యేకంగా దుకాణ సముదాయం నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు పట్టణంలో బగత్‌గల్లీలో పీర్లమసీదుతో పాటు ప్రభుత్వ డిగ్రీకళాశాల వద్ద దుకాణ సముదాయాలను ప్రారంభించారు. పట్టణంలో అందరి సహకారంతో అభివృద్ధి చేస్తానని చెప్పారు. ప్రభుత్వ కళాశాల వద్ద దుకాణ సముదాయాన్ని రూ.14 లక్షల వ్యయంతో నిర్మించడం జరిగిందని తెలిపారు. దీనితో డిగ్రీకళాశాల నెలనెలా వచ్చే అద్దెలతో నిర్వహణ సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శంకర్‌యాదవ్, మార్కెట్‌కమిటీ అధ్యక్షురాలు పుష్పానగేష్, ఉపాధ్యక్షులు బసవేశ్వర్, ఆత్మ కమిటీ ఛైర్మన్ కుమార్‌గౌడ్ మైనార్టీ నాయకులు లియాఖత్‌అలీ, ఇక్బాల్, మక్బూల్, అబ్బుల్, విజయ్ పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: భాజపాలో బూత్‌స్థాయి కమిటీలు వేసి బలోపేతం చేయాలని భాజపా రాష్ట్ర కార్యవర్గసభ్యులు నరేందర్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు భాజపా కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు కార్యకర్తలు తెలియ జేయాలన్నారు. ప్రతి కార్యకర్త కష్టపడి సైనికుల్లా మారి భాజపాను తిరుగులేని శక్తిగా ఎదిగేలా చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాజపా నియోజకవర్గ కన్వీనర్ నర్సింగరావు, మండల కమిటీ అధ్యక్షులు ప్రభాకర్‌గుప్త, మాజీ అధ్యక్షులు ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి మన్నెరాజు, బాబరాజుగౌడ్, జిల్లా నాయకులు లక్ష్మణ్, సాగర్, వీరారెడ్డి, మల్లికార్జున్, సోమేశ్, మల్లేషం పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సంపూర్ణ సహకారం

గుమ్మడిదల: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు అండగా ఉంటామని సీజీఆర్ ట్రస్టు వ్యవస్థాపకుడు గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గుమ్మడిదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బెల్టు, గుర్తింపు కార్డు, టైలను అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. గుమ్మడిదల పాఠశాల గదులకు మరమ్మతులు, ఫర్నీచర్ తదితరమైనవి ఉచితంగా అందచేసినట్లు తెలిపారు.

నేడు హైదరాబాద్ సదస్సుకు పాలనాధికారి

సంగారెడ్డి టౌన్: ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న కాన్ఫరెన్సుకు జిల్లా పాలనాధికారి మాణిక్కరాజ్ వెళ్లనున్నారు. కాన్ఫరెన్సు నేపథ్యంలో పలు శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలు సిద్ధం చేసే పనిలో బుధవారం జిల్లా యంత్రాంగం నిమగ్నమైంది. ఆయా శాఖలకు సంబంధించి జిల్లాలో అమలుచేస్తున్న పథకాలు, ప్రగతికి సంబంధించిన సమాచారంతో పాలనాధికారి కాన్ఫరెన్సుకు హాజరుకానున్నారు.

చిన్నారులు.. స్ఫూర్తి రగిలించారు



మట్టిని తవ్వుతున్న చిన్నారులు



బురదను మట్టితో పూడుస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

స్వచ్ఛభారత్ స్ఫూర్తితో చిన్నారులు శ్రమదానం చేశారు. సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనీ పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు పలు సేవలు అందించారు. కాలనీలోని అంతర్గత రహదారి వర్షంతో గుంతలమయంగా మారడంతో వాటిని పూడ్చి రహదారిని బాగు చేశారు. జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో భాగంగా వ్యాసరచన, స్వచ్ఛ భారత్ అంశాలను ఎంచుకున్నారు. శ్రమదానం చేసిన తీరును వీడియో చిత్రీకరణ చేశారు. దిల్లీలోని ఎన్‌సీసీ కార్యాలయానికి పంపేందుకు ఈ పనులు చేస్తున్నారు. పోటీతో పాటు కాలనీవాసుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ఇక్కడ మరో కీలక అంశం ఏమంటే తమ పుట్టిన రోజు వేడుకలకు డబ్బులు వృథా చేయడం లేదు. సంగారెడ్డి ఎంఎన్ఆర్ కళాశాలకు చెందిన 'రైజన్ ట్రాన్స్ గ్రూపు'నకు చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తేజ పుట్టిన రోజు సందర్భంగా దివ్యదిశ అనాథ ఆశ్రమంలో తోటి విద్యార్థులతో కలిసి వసతిగృహానికి 10 కేజీల పప్పు, 10 కేజీల రవ్వ, రెండు దోమల బ్యాట్లు, రెండు అల్లం డబ్బాలు 10 కేజీల బియ్యం, రెండు కేజీల కేక్ తెచ్చి విద్యార్థుల మధ్య పుట్టిన రోజు సంబురాలు చేసుకున్నారు. దీంతో పాటు విద్యుత్తు బిల్లు రూ.1500 కూడా చెల్లించారు. వినాయక చవితి సందర్భంగా చిన్నారులకు పుట్టిన రోజు కానుకగా విద్యార్థులతో సెల్ఫీలు దిగి వేడుకలు చేశారు. విద్యార్థుల్లో వెంకట్, మల్లికార్జున్, భూపతి, శృతి, మౌనిక, కిరణ్మయి, సాయి మౌనిక ఉన్నారు.



విద్యార్థులకు ఆట వస్తువుల అందజేత

– చిత్రాలు : ఈనాడు, సంగారెడ్డి

బురదలో ఇకుక్కున్న లారీ!

నాలుగు మండలాలకు రాకపోకలు బంద్

నారాయణఖేడ్: ఖేడ్ మండలం తుర్కపల్లితండా వద్ద మళ్లింపు రహదారిలో బుధవారం ఉదయం జేసీబీ లోడుతో వస్తున్న ఓ లారీ దిగబడటంతో నాలుగు గంటల పాటు వివిధ మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఖేడ్ నుంచి సిర్గాపూర్ వెళ్లే మార్గంలో ఖేడ్ మండలంలోని తుర్కపల్లితండా వద్ద వాగుపై ఉన్న కల్వర్టు 10 నెలల కిందట కురిసిన భారీ వర్షాల కారణంగా కూలిపోయింది. దీంతో పక్కనుంచి సిమెంటు పైపులు వేసి పైన మొరం పోసి తాత్కాలికంగా రహదారిని నిర్మించారు. కొద్దిపాటి వర్షాలు కురిస్తే ఈ దారి తరచుగా కోతకు గురవుతుంది. బుధవారం సిర్గాపూర్ వైపునుంచి ఖేడ్ వైపు జేసీబీతో కూడిన లోడుతో వస్తున్న లారీ దిగబడటంతో వాహనదారులతోపాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లారీలోంచి జేసీబీని కిందకు దించి మొరంతో చదును చేసి రాకపోకలను పునరుద్ధరించారు.



మళ్లింపు దారిలో దిగబడిన లారీ

నవభారత నిర్మాణమే లక్ష్యం

ఐఐటీలో సదస్సు

సంగారెడ్డి టౌన్: నవభారత నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగుతామని ఐఐటీ విద్యార్థులు ప్రతినబూనారు. మండల కేంద్రమైన కంది శివారులోని ఐఐటీ హైదరాబాద్‌లో బుధవారం కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ విభాగం ఆధ్వర్యంలో 'సంకల్ప్ సే సిద్ధి', 'ఏ ఇండియా కా టైం హై' పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించారు. క్విట్ ఇండియా ఉద్యమానికి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మంతన్ పేరిట నిర్వహించిన సదస్సులో నవ భారత్ నిర్మాణంపై చర్చలు జరిగాయి. విద్యార్థులు, ఆచార్యులు ఇందులో భాగస్వాములయ్యారు. విద్యార్థులు తాము ఏమి కోరుకుంటున్నారో, దేశహితం కోరుతూ సూచనలు చేశారు. ఆచార్యులు కూడా చర్చలో భాగంగా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. దేశంలో ప్రస్తుతం ఉన్న సమస్యలు, సాంకేతిక పరిష్కారాలు అన్న అంశంపై చర్చ ఆసక్తికరంగా సాగింది. సదస్సును ఉద్దేశించి ఐఐటీ డైరెక్టర్ యు.బి. దేశాయ్ మాట్లాడుతూ నవభారత్ కోసం విద్యార్థులు ఇప్పటి నుంచే ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇందుకు అనుగుణంగా వినియోగించేందుకు పరిశోధనలు జరగాలని సూచించారు. కార్యక్రమంలో హైదరాబాద్ నుంచి వచ్చిన రాక్‌బ్యాండ్ కళాకారులు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు.



సదస్సులో పాల్గొన్న ఆచార్యులు, విద్యార్థులు



రాక్‌బ్యాండ్‌లో గీతాలను ఆలపిస్తున్న కళాకారులు



పాల్గొన్న విద్యార్థులు

నాట్కో సహకారం.. విద్యార్థులకు ఉపకారం



ఆకర్షణీయంగా ఇందిరానగర్ జడ్పీ ఉన్నత పాఠశాల

ఉపాధ్యాయుల ప్రత్యేక చొరవ.. నాట్కో ట్రస్టు సహకారం.. ఆ పాఠశాలకు కొత్త రూపు ఇచ్చింది. ఆకర్షణీయ రంగులు.. ఆధునిక వసతులు.. నూతను శోభను తెచ్చిపెట్టింది. రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు శ్రద్ధతో మరో నమూనా పాఠశాల సిద్దిపేట సొంతమైంది. కార్పొరేట్ విద్యా సంస్థలను తలపించేలా హంగులద్దుకున్న సిద్దిపేటలోని ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం.. అదనపు తరగతి గదులతో ప్రారంభానికి సిద్ధమైంది. ఈ సందర్భంగా 'న్యూస్‌టుడే' కథనం..

- ఆధునిక వసతులు.. సరికొత్త రూపు
- హంగులద్దుకున్న ఇందిరానగర్ జడ్పీ ఉన్నత పాఠశాల
- అందుబాటులోకి మూడు అదనపు తరగతి గదులు
- ప్రారంభానికి సిద్ధమైన భవనం

న్యూస్‌టుడే, సిద్దిపేట టౌన్

సిద్దిపేటలోని ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 14 సెక్షన్లు.. 650 మంది విద్యార్థులతో ప్రభుత్వ పాఠశాలల్లో మేటిగా నిలుస్తోంది. ఆంగ్ల మాధ్యమంలో అత్యధిక మంది విద్యార్థులతో ప్రత్యేకతను చాటుతోంది. 25 మంది బోధనా సిబ్బందితో ఫలితాల్లోనూ ఉత్తమంగా రాణిస్తోంది. గత విద్యా సంవత్సరం వరకు 11 తరగతి గదులు మాత్రమే ఉండగా.. 500 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేశారు. గదుల కొరతతో కొత్తగా విద్యార్థులను చేర్చుకోలేని పరిస్థితి ఉత్పన్నమైంది. ఈ నేపథ్యంలో మంత్రి దృష్టికి సమస్య వెళ్లగా.. హైదరాబాద్‌కు చెందిన నాట్కో సంస్థను సంప్రదించారు. దీంతో వారు సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ) కింద రూ. 70 లక్షలతో వివిధ నిర్మాణాలు, వసతుల కల్పనకు ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో ఈ సంవత్సరం ఫిబ్రవరిలో నిర్మాణాలు ప్రారంభించారు. పనులు పూర్తయి ప్రారంభానికి సిద్ధమైంది.



గదిలో సాఫ్ట్ బోర్డులు, బల్లలు

అడిగిందే తడవుగా..

పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అడిగిందే తడవుగా వసతుల కల్పనలో వెనుకాడకుండా సంస్థ నిర్మాణాలు చేపట్టింది. పాఠశాల భవనంపై మూడు అదనపు తరగతి గదులు, నమూనా వంటగది, రెండు నమూనా శౌచాలయాలు నిర్మించారు. స్మార్ట్ బోర్డుతో కూడిన డిజిటల్ తరగతి గదిని సమకూర్చారు. తరగతి గదుల్లో 40 స్మార్ట్‌బోర్డులు, సమావేశ మందిరానికి వంద కుర్చీలు, క్రీడా సామగ్రి, ఇతర సదుపాయాలు కల్పించారు. తరగతి గదుల వెలుపల గ్రీన్‌బోర్డుల ఏర్పాటుతో పాటు క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేశారు. ఇదే క్రమంలో భవనానికి, తరగతి గదుల్లో ఆకర్షణీయత, ఆహ్లాదాన్ని పంచే రంగులు వేశారు. తద్వారా విద్యార్థుల చదువులు మరింత సాఫీగా సాగే అవకాశం ఉందని హెచ్‌ఎం రామస్వామి తెలిపారు.

మరిన్ని గదులు నిర్మిస్తే..

మరిన్ని గదులు నిర్మించి అందుబాటులోకి తీసుకువస్తే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. విభిన్న, వినూత్న బోధనా పద్ధతులతో ఏటా అత్యధిక మంది ఈ పాఠశాలలో ప్రవేశాలు పొందేందుకు ఆసక్తి కనబర్చుతున్నారు. ఇలా ఈ విద్యా సంవత్సరం కూడా ప్రవేశాలు సామర్థ్యాన్ని మించి రావడంతో సుమారు 200 మందిని చేర్చుకోలేకపోయారు. ఆస్థాయిలో మరిన్ని తరగతి గదులు, వసతులు కల్పిస్తే విద్యార్థులకు సౌకర్యవంతంగా మారి వసతులు పెరిగే అవకాశం ఉంది.



నిర్మాణమైన ర్యాంప్



పాఠశాల ఆవరణలో పచ్చదనం

మత్స్యకారుల ప్రగతే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి) డబ్బులు చెల్లిస్తే సరిపోతుందన్నారు. మత్స్యశాఖకు ఉమ్మడి రాష్ట్ర బడ్జెట్‌లో రూ.5 కోట్లు కేటాయించే వారని ఇప్పుడు సొంత రాష్ట్రంలో రూ.వెయ్యి కోట్లు పెట్టామన్నారు. మత్స్యకారులకు ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను సైతం ఇచ్చినట్లు గుర్తుచేశారు. రూ.20 వేలు ఖరీదు చేసే ఫిష్‌స్టాల్‌ను కేవలం రూ 5 వేలకు అందజేస్తున్నామన్నారు. చేపలను గ్రామాలు, పట్టణాల్లోని మురుగు కాలువల వెంట అమ్ముకోకుండా ఈ స్టాళ్లను కొనుగోలు చేసుకోవాలన్నారు. ఇక ఇప్పటివరకు రాష్ట్రంలో 15.36 లక్షల గొర్రెలను పంపిణీ చేశామన్నారు. గత ప్రభుత్వాలన్నీ హామీల కోతలకు పరిమితమైతే ఇప్పుడు చేతలతో చేసి చూపెడుతున్నట్లు తలసాని ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే బాబూమోహన్ మాట్లాడుతూ.... గోదావరి జలాలు వస్తే సింగూరు జలాశయం ఎన్నటికీ ఎండిపోదని, ప్రతి సంవత్సరం కోటి చేపపిల్లలు విడుదల చేయాలని, జోగిపేటలో చేపల మార్కెట్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో మత్స్యశాఖ, పశు సంవర్ధకశాఖ రాష్ట్ర కమిషనర్లు సువర్ణ, రాథోడ్, జిల్లా గొర్రెల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు బాపు మల్‌షెట్టి, సంచాలకుడు భూమయ్య, జోగిపేట మార్కెట్ కమిటీ అధ్యక్షుడు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

చట్టం.. కొందరి చుట్టమా!

(మొదటిపేజీ తరువాయి) తలొగ్గడంతోపాటు పలుకుబడి ఉన్న లబ్ధిదారులతో క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు కుమ్మక్కు కావడంతోనే ఇలా చేసి ఉంటారని రెవెన్యూ విభాగంలోని కొందరు అధికారులే వ్యాఖ్యానిస్తున్నారు. సాగు చేయలేదనే కారణం చూపి నిరుపేదలైన చలపతి కుటుంబం నుంచి భూములను లాగేసుకోవడం న్యాయం కాదని వారు వివరిస్తుండటం గమనార్హం. ఇదే గ్రామానికి చెందిన కుమ్మరి నర్సింహులు అనే వ్యక్తికి ఇచ్చిన 1.20 ఎకరాలు ఆ తర్వాత ఆయన కుమారుడు మల్లేశం తన పేరు మీదకు మార్చుకున్నారు. తండ్రి చనిపోవడంతో నలుగురు చెల్లెళ్ల వివాహాలు తానే చేయాల్సి వచ్చిందని, ఉన్న భూమినీ అధికారులు లాగేసుకోవడంతో న్యాయం చేయాలని వారి చుట్టూ తిరుగుతున్నానని మల్లేశం తన ఆవేదనను వినిపిస్తున్నారు. తమకు కేటాయించిన భూమిలో విద్యుత్తు ఉపకేంద్రం నిర్మించారని, ఆ సందర్భంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చినా ఇప్పటికీ అధికారులు నెరవేర్చకుండా తిప్పించుకుంటున్నారని మల్లేశం తన నిస్సహాయతను వ్యక్తం చేశారు.

కోమటిబండను సందర్శించిన ఇంజినీర్లు



కోమటిబండ వద్ద మధ్యప్రదేశ్ ఇంజినీర్ల బృందం

గజ్వేల్, న్యూస్‌టుడే: గజ్వేల్ మండలం కోమటిబండలో నిర్మించిన మిషన్‌భగీరథ పథకాన్ని మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ల బృందం బుధవారం పరిశీలించింది. ప్రజల దాహార్తికి శాశ్వత పరిష్కారంగా ఇక్కడ అమలుచేస్తున్న పథకం తీరుతెన్నులను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. అకుపచ్చని వర్ణంతో ఆహ్లాదాన్ని పంచుతున్న కొండ పరిసరాలలో కలియదిరిగి, ఫొటోలు దిగుతూ గడిపారు. మధ్యప్రదేశ్‌లో కూడా ఈ తరహా పథకం అమలుచేసేందుకే అధ్యయనం కోసం ఇక్కడికి వచ్చినట్టు తెలిపారు. ఇక్కడి విషయాలను జిల్లా ఎస్ఈలు విజయప్రకాశ్, రాజయ్య వారికి వివరించారు.

'అపరాలు' ఆగమాగం

(మొదటిపేజీ తరువాయి) దిగుబడి లేకపోవడం, చేతికి అందిన పంటకూ మద్దతు ధర లేకపోవడంతో నష్టాల పాలవుతున్నారు. ఒక క్వింటా మేలు రకం పెసర పంట ధర రూ.4800 నుంచి రూ.4900, రెండో రకం ధర రూ.4200 నుంచి రూ.4500, రంగుమారిన నీటిలో తడిసిన పంటకు ధర రూ.3000 రూ.3500 మాత్రమే ఉంది. మరికొంత మంది వ్యాపారులు దిగుబడులను కొనడం లేదని రైతులు వాపోతున్నారు. ఎకరాలో రెండు క్వింటాళ్లకు మించి దిగుబడి రావడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. ఈ ఏడు న్యాల్‌కల్ సుమారు 3200 ఎకరాల్లో పెసర, 1800 ఎకరాల్లో మినుము పంటను సాగు చేశారు. దాదాపుగా 15000 ఎకరాలకు పైగా పత్తిపంట సాగైంది. ప్రధానంగా మండలంలోని మంజీరా తీర గ్రామాలు చాల్కి, రాఘవపూర్, మరియంపూర్, చిన్నెపల్లి, చీకూర్తి, హుస్సేనగర్, అమీరాబాద్, ముర్తుజాపూర్, కాకిజనవాడ, హుమ్నాపూర్, ఇబ్రహీంపూర్ గ్రామాల్లో పెసర, మినుము పంటను వేశారు. పక్షం రోజులుగా కురుస్తున్న వర్షాలతో కోతకు వచ్చిన పెసర పంట తీయలేని పరిస్థితి నెలకొంది. కోసిన పంట పొలంలోనే ఉండిపోయింది. లోతట్టు ప్రాంతాల్లోని పంట పూర్తిగా నీట మునగడంతో రైతులు పూర్తిగా నష్టపోయారు. నారింజ ప్రాజెక్టు ఉద్ధృతితో రేజింతల్, ఖలీల్‌పూర్, మిర్జాపూర్(బీ) గ్రామాల శివారులోని వందల ఎకరాల పంటలు నీట మునిగాయి. తమకు ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



వర్షపు నీటిలో పెసర పంట

ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని కొద్ది రోజులుగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడం.. పలు ఉద్యోగాల భర్తీకి ప్రకటనలు వెలువడుతున్న నేపథ్యంలో నిరుద్యోగుల్లో ఆశలు చిగురుస్తున్నాయి. ఏన్నో ఏళ్ల నుంచి ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న వారిలో ఉత్సాహం రెట్టింపవుతోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈసారి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో నిరుద్యోగులు చాలా మంది కృత నిశ్చయంతో ఉన్నారు. నిరుద్యోగ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇచ్చి.. ఉద్యోగాలకు సన్నద్ధం చేసేందుకు ప్రభుత్వం బీసీ స్టడీ సర్కిళ్లకు ప్రాధాన్యం ఇస్తోంది. ఆ కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు ఆశాదీపంగా మారాయి. రూ.వేలకు వేలు వెచ్చించి పట్టణాల్లో శిక్షణ పొందలేక.. స్థానికంగా అవసరమైన పుస్తకాలు లభించక నీరసించిపోతున్న వారికి ఈ అధ్యయన కేంద్రాలు (స్టడీ సర్కిళ్లు) వరంగా మారాయి.. ఇక్కడ ప్రతి ఉద్యోగ ప్రకటనకు అర్హుల నుంచి ప్రత్యేకంగా దరఖాస్తులను ఆహ్వానించి.. శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. తాజాగా బీసీ స్టడీ సర్కిల్‌లో సెప్టెంబరు 4 నుంచి అటవీశాఖలో ఉద్యోగాల కోసం శిక్షణ కేంద్రం ప్రారంభించనున్న నేపథ్యంలో 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.



అంబేడ్కర్ స్టడీ సర్కిల్ కార్యాలయం


భవితకు రక్ష..!



- నిరుద్యోగులకు అండగా అధ్యయన కేంద్రాలు
- సత్ఫలితాలిస్తున్న శిక్షణ శిబిరాలు
- తాజాగా దరఖాస్తులకు ఆహ్వానం
- పలు ఉద్యోగ ప్రకటనల నేపథ్యం

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్

సంగారెడ్డిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మైదానం ఆవరణలో బీసీ స్టడీ సర్కిల్‌ను ప్రభుత్వం 2012 నవంబరులో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వ ఉద్యోగాల విభాగాలైన ఆబ్కారీ, పోలీసు, బ్యాంకు ఉద్యోగాలు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ కార్యదర్శులు, అటవీ శాఖ సిబ్బంది, సెక్టార్ అధికారులు, గ్రూప్-2, 4, ఎస్ఐ, గురుకులాల్లో ఉద్యోగాల కోసం.. నిరుద్యోగులకు ఇక్కడ ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు బీసీ స్టడీ సర్కిల్ కేంద్రంలో 724 మంది నిరుద్యోగులు శిక్షణ పొందగా.. వీరిలో 72 మందికి వివిధ రకాల ఉద్యోగాలు లభించాయి. గ్రూప్-2, గ్రూప్ 4, ఎస్ఐ పరీక్షల ఫలితాలు ఇంకా వెల్లడి కావాల్సి ఉంది. ప్రత్యేక శిబిరానికి వచ్చే వారికి ఉచిత శిక్షణతో పాటు.. టీ, మధ్యాహ్న భోజనం ఉచితంగా ప్రభుత్వమే అందిస్తుంది. తాజాగా అటవీశాఖలో పలు ఉద్యోగాల భర్తీకి ప్రకటన వెలువడిన నేపథ్యంలో అర్హులైన నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఇప్పటికే 40 మంది దరఖాస్తు చేసుకున్నారని.. ఇంకా గడువు ఉన్నందుకు నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు చెబుతున్నారు.



దాతల సహాయంతో..

సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టడీ సర్కిల్ దాతల సహాయంతో కొనసాగుతోంది. ఈ కేంద్రాన్ని 2014లో ప్రారంభించారు. అప్పటి నుంచి ఇక్కడ వివిధ పోటీ పరీక్షలకు అభ్యర్థులు శిక్షణ పొందుతూ సేవలు పొందుతున్నారు. అత్యధికంగా ఎస్ఐ, పోలీసు కానిస్టేబుళ్లకు శిక్షణ ఇచ్చారు. ఇటీవల కానిస్టేబుళ్ల ఉద్యోగాలకు 178 మంది శిక్షణ పొందారు. వీరిలో 75 మంది అర్హత సాధించారు. వారిలో 61 మంది ప్రధాన పరీక్షకు అర్హత సాధించగా.. 16 మంది ఉద్యోగాలు సాధించారు. ఎస్సై అభ్యర్థులు 15 మంది ఇక్కడ శిక్షణ పొందారు. వారిలో 15 మంది రాత పరీక్షకు అర్హత సాధించారు. పరీక్షలు రాశారు. ఇంకా తుది ఫలితాలు వెల్లడి కావాల్సి ఉంది. త్వరలో వివిధ రకాల ఉద్యోగాలకు 200 మంది అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కింద నోటిఫికేషన్‌కు అనుగుణంగా.. కమిటీ నిర్ణయం మేరకు నిరుద్యోగ అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని స్టడీ సర్కిల్ డైరెక్టర్ రామారావు పేర్కొన్నారు.

దరఖాస్తు విధానం ఇదీ..

- ప్రస్తుతం బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో అటవీ శాఖలో బీట్ ఆఫీసర్, సెక్టార్ ఆఫీసర్ ఉద్యోగాలకు నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.
- త్వరలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకోనున్నారు.
- ఏ పోస్టుకు దరఖాస్తు చేస్తే దానికి సంబంధించిన వివరాలు, కులం, ఆదాయం ధ్రువపత్రాలు సమర్పించాలి.
- గ్రామీణ ప్రాంతానికి చెందిన నిరుద్యోగులకు రూ.2 లక్షల లోపు ఆదాయం ఉండాలి.
- పట్టణ ప్రాంతానికి చెందిన నిరుద్యోగులకు రూ.1.50 లక్షల లోపు ఆదాయం కల్గి ఉన్న వారు అర్హులు.
- ఆసక్తి ఉన్న అభ్యర్థులు 200 మందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు వసతులు ఉన్నాయి.
- సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన అభ్యర్థులకు ఇక్కడ శిక్షణ ఇవ్వనున్నారు.



సంగారెడ్డిలోని బీసీ స్టడీ సర్కిల్ కేంద్రం

పంచాయతీ కార్యదర్శి ఉద్యోగం సాధించా..



– కమలాబాయి, ఉద్యోగిని, అల్లాదుర్గం

మాది అల్లాదుర్గం మండలం ఐబీ తండా.. సంగారెడ్డిలోని బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందకుంటే పంచాయతీ కార్యదర్శి ఉద్యోగం వచ్చేది కాదు. అక్కడ శిక్షణతో ప్రోత్సహిస్తున్న తీరు, సన్నద్ధం కావడానికి ఇస్తున్న మెటీరియల్ చాలా బాగుంది. ప్రస్తుతం పెద్ద శంకరంపేటలో ఉద్యోగం చేస్తున్నా. ఉద్యోగం రావడం ఎంతో ఆనందంగా ఉంది. బీసీ స్టడీ సర్కిల్ నిర్వాహకులకు రుణ పడి ఉంటాం.


నిరుద్యోగులకు మంచి అవకాశం



– నవీన్, పోలీసు కానిస్టేబుల్, నారాయణఖేడ్

మాది నారాయణఖేడ్ మండలం హన్మంతరావుపేట. సంగారెడ్డిలో అంబేడ్కర్ స్టడీ సర్కిల్ కేంద్రంలో ఉచిత శిక్షణ పొందా. ఈ శిక్షణ కేంద్రంలో పలువురు అనుభవం కలిగిన నిపుణులతో విషయ అవగాహన కల్పించారు. పోలీసు కానిస్టేబుళ్ల దేహదారుఢ్య పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసేందుకు వ్యాయామ ఉపాధ్యాయుడితో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. దీంతో ఉద్యోగానికి ఎంపిక అయ్యా. ప్రస్తుతం మేడ్చల్‌లో శిక్షణలో ఉన్నా.

యువత సద్వినియోగం చేసుకోవాలి



– రాములు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్, సంగారెడ్డి

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ల ఆధారంగా నిరుద్యోగులకు శిక్షణ ఇవ్వడానికి మా సంస్థ సిద్ధంగా ఉంది. ఈ శిక్షణ కేంద్రాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి. ఉచితంగా శిక్షణతో పాటు మధ్యాహ్నం భోజన సౌకర్యం కల్పిస్తున్నాం. కేవలం బీసీలకే కాకుండా ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ల ప్రకారం అవకాశం కల్పిస్తున్నాం. విధంగా బీసీ కళాశాలల్లో (ఆశ్రమ కళాశాలలు, గురుకుల కళాశాలలు) చదువుతున్న వారికి ప్రతి నెలా ప్రభుత్వ ఉద్యోగాలపై అవగాహన కల్పించడమే కాకుండా.. చదువులో రాణించేందుకు తీసుకోవాల్సిన విషయాలపై నిపుణులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం.



పాలనాధికారి నుంచి ప్రశంసాపత్రం అందుకుంటూ..

లక్ష్యం ముందు.. ఓడిన వైకల్యం..!

స్ఫూర్తిదాయకం.. యాదయ్య ప్రయత్నం

లక్ష్యాన్ని సాధించాలంటే నిరంతరం శ్రమించాలి. ప్రస్తుత పోటీ ప్రపంచంలో వ్యక్తి శరీర అవయవాలు సక్రమంగా ఉన్నా.. రాణించడం కష్టంగా మారుతోంది. ఇలాంటి తరుణంలో అంధత్వం ఉందని ఆ యువకుడు బాధ పడలేదు. పట్టుదలతో దేన్నైనా సాధించవచ్చని నిరూపించారు. కంటి చూపు లేకున్నా.. స్నేహితుల సహకారంతో చదువుతూ పలువురి మన్ననలను అందుకుంటున్నారు. టేక్మాల్ మండల పరిధిలోని యాదయ్య స్ఫూర్తిదాయక ప్రయత్నంపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

ఉపాధ్యాయుడిని కావడమే లక్ష్యం: యాదయ్య

ప్రతి నిమిషాన్ని వృథా చేయకుండా చదువుకునేందుకు దృష్టి సారిస్తున్నా. స్నేహితుల సహకారం, ఆడియో సీడీలు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో చదువును కొనసాగిస్తున్నా. డైట్ అనంతరం ఉపాధ్యాయుడిని కావడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నా. అనంతరం మరింత కష్టపడుతూ చదివి గ్రూప్-2 సాధిస్తా. పోటీ పరీక్షలకు ఎప్పటికప్పుడు సిద్ధమవుతున్నా. తల్లిదండ్రులు కూడా పూర్తిగా సహకరిస్తున్నారు.

న్యూస్‌టుడే, టేక్మాల్

టేక్మాల్ మండల పరిధిలోని ఎల్లంపల్లి గ్రామానికి చెందిన ఉప్పరి రాములు, లలిత దంపతుల కుమారుడు యాదయ్య. చిన్నప్పటి నుంచి కంటిచూపు సరిగా లేదు. 2003 సంవత్సరంలో పదో తరగతి పరీక్ష రాశారు. అప్పుడు కంటి చూపు కొంత మెరుగ్గానే ఉంది. తెలుగు సబ్జెక్టులో ఉత్తీర్ణత సాధించలేదు. ఆ తర్వాత కంటి చూపు మందగించింది. అప్పటికే ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న కుటుంబ సభ్యులు కంటి శస్త్ర చికిత్సకు డబ్బులు లేక మిన్నకున్నారు. అప్పటి నుంచి యాదయ్య ఇంటి వద్దే ఉన్నారు. కంటి చూపు పూర్తిగా క్షీణించడంతో స్నేహితుల సహకారంతో చదువుకొని.. 2013 సంవత్సరంలో పదో తరగతి పరీక్షను సహాయకుడి తోడ్పాటుతో రాసి ఉత్తీర్ణులయ్యారు. 2014లో హెచ్ఈసీలో చేరారు. అధ్యాపకుల ప్రోత్సాహం, స్నేహితుల సహకారంతో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 500 మార్కులకు గాను 427 మార్కులు సాధించారు. కళాశాల స్థానంలో ప్రథమ స్థానంలో నిలిచారు. రెండో సంవత్సరంలో హెచ్ఈసీ గ్రూపు స్థాయిలో జిల్లాలో మూడో ర్యాంకుతో పాటు జిల్లా ప్రభుత్వ కళాశాలల పరిధిలో హెచ్ఈసీ గ్రూపు విభాగంలో జిల్లా ప్రథమ స్థానం సాధించారు. ప్రస్తుతం సిద్దిపేటలో డైట్ రెండో సంవత్సరం చదువుతున్నారు. హైదరాబాద్‌లోని సమృత ట్రస్టు వారు సబ్జెక్టులపై ఇచ్చిన ఆడియో సీడీల ద్వారా పరీక్షలకు సిద్ధమవుతున్నారు.

విధి 'చిన్నచూపు' చూసింది

యాదయ్యకు చిన్నప్పుడు ఒక కంటికి దెబ్బ తగలడంతో ఒక కంటి చూపు తగ్గింది. ఆర్థిక స్థోమత లేదు. అయినప్పటికీ కుటుంబ సభ్యులు అప్పు చేసి 2004 సంవత్సరంలో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో నేత్ర శస్త్ర చికిత్స చేయించారు. అప్పట్లో కంటి చూపు కొంత మెరుగు పడినప్పటికీ మరోసారి లేజర్ ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించడంతో అదే సంవత్సరం లేజర్ ఆపరేషన్ సైతం నిర్వహించారు. కానీ కంటిచూపు పూర్తిస్థాయిలో రాలేదు. రెండు కళ్లు కనబడక ఆయన అంధుడిగా మారారు. ఆ తర్వాత వైద్యానికి డబ్బులు లేకపోవడంతో కుటుంబ సభ్యులు కూడా చేతులెత్తేశారు. కళ్లు కనబడకపోయినా స్నేహితుల సహకారంతో చదువును కొనసాగిస్తూ అంధత్వం ఉన్నా చదువుపై పూర్తి పట్టు సాధిస్తున్నారు.



తల్లిదండ్రులతో యాదయ్య

ప్రతిభకు తార్కాణాలు...

- జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా 2015 జనవరి మాసంలో అందోలు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన క్విజ్, ఉపన్యాస పోటీలకు యాదయ్య హాజరై.. నియోజకవర్గ స్థాయిలో క్విజ్‌లో ప్రథమ స్థానం, ఉపన్యాసంలో ద్వితీయ స్థానంలో నిలిచారు.
- అదే సంవత్సరం జిల్లా స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి అప్పటి కలెక్టర్ రాహుల్‌బొజ్జా చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.
- జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా 2015 డిసెంబరులో మాసంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఉపన్యాస పోటీల్లో రెండో స్థానంలో నిలిచారు.
- జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి కలెక్టర్ రొనాల్డ్‌రోస్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.
- జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో ఈ ఏడాది నిర్వహించిన రాష్ట్రస్థాయి క్విజ్‌పోటీలో పాల్గొని నాలుగో స్థానంలో నిలిచి ప్రశంసాపతాన్ని అందుకున్నారు.
- 2016 సంవత్సరంలో మంత్రి హరీశ్‌రావు యాదయ్యకు ల్యాప్‌టాప్ అందించి అభినందించారు. దీంతో వాయిస్ ద్వారా చదువుకునేందుకు అనుకూలమైన సాఫ్ట్‌వేర్ వేసుకొని వినియోగిస్తున్నారు.
- 2017 జనవరిలో సిద్దిపేటలో యువతరంగం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా క్విజ్ పోటీల్లో రెండో స్థానంలో నిలిచి బహుమతిని అందుకున్నారు.
- 2017లో రిపబ్లిక్ డే సందర్భంగా సంగారెడ్డి కలెక్టర్ చేతుల మీదుగా బహుమతితో పాటు మూడు వేల నగదును అందుకున్నారు.
- డైట్ సెట్‌లో ప్రథమ సంవత్సరం ఫలితాల్లో కళాశాల స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు.
- హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో రాష్ట్ర సాగర సంఘం ఆధ్వర్యంలో యాదయ్యను ఈ ఏడాది ఆగస్టు 20న ఘనంగా సన్మానించారు.



సాధన చేస్తున్న యువతీ యువకులు

కార్మికుల బిడ్డలు.. కరాటేలో దిట్టలు



కరాటేలో యువతి విన్యాసం

న్యూస్‌టుడే, జిన్నారం

అందరూ కార్మికులే.. పొట్ట చేత పట్టుకుని వచ్చిన వారే. పూట గడవని స్థితిలోనూ బిడ్డలకు కరాటేలో శిక్షణ ఇప్పిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ, జిల్లా స్థాయి పోటీలకు పంపిస్తున్నారు. దీంతో పారిశ్రామికవాడల్లో యువతీ, యువకులు కండలు తిరిగి యుద్ధ విద్యలో ఆరితేరుతున్నారు. అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. కరాటేలో శిక్షణ పొందే యువకులు చాలా వరకు క్రమశిక్షణతో ఉంటారు. అత్యవసర సమయాల్లో మినహా తమకు వచ్చిన అనేక విన్యాసాలను ప్రదర్శించరు. బాలికలకు, యువతులకు ఆత్మ రక్షణకు కరాటే తోడ్పడుతుందని పలువురు పేర్కొంటున్నారు. బాలికల తల్లిదండ్రులు సైతం మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణను ఇప్పించటానికి తోడ్పాటు నందించడం పారిశ్రామికవాడల్లో కొత్త పోకడ.



నాన్‌చాక్ విన్యాసం చేస్తున్న యువకుడు



- **జాన్...** బ్లాక్ బెల్ట్ సాధించిన ఈ యువకుడు కార్మికుడి కుమారుడు. తండ్రి విజయ్‌కుమార్ మహబూబ్‌నగర్‌కు చెందిన వారు. ఐడీఏ బొల్లారంలో నివాసం. స్థానిక పరిశ్రమలో పనులు చేసుకుంటున్నారు. ఇప్పటి దాకా 25 జాతీయ అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శనలు ఇచ్చి అవార్డులు అందుకున్నారు. రాష్ట్ర, స్థానిక టోర్నమెంట్లకు లెక్కేలేదు. విశాఖపట్నం, కరీంనగర్, ఎల్‌బీస్టేడియం, మహబూబ్‌నగర్‌లలో నిర్వహించిన వేదికలలో ప్రత్యేక ప్రతిభ చూపారు.



- **దోని...** బ్లాక్ బెల్ట్ సాధించిన ఈ యువకుడు ఒడిశా రాష్ట్రానికి చెందిన వారు. తాను ఒక్కడే ఇక్కడ ఉంటారు. కుటుంబ మంతా ఒడిశాలో ఉంటుంది. డాక్టర్ రెడ్డీస్ పరిశ్రమలో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తారు. ఇప్పటిదాకా 15 అంతర్జాతీయ, జాతీయ వేదికలపై ప్రతిభ చూపి అవార్డులను అందుకున్నారు. విశాఖపట్నంలో నిర్వహించిన అంతర్జాతీయ వేదికపై పలు ప్రదర్శనలు ఇచ్చి ప్రత్యేకంగా గుర్తింపు పొందారు.



- **ధన్‌రాజ్...** ఖమ్మం జిల్లాకు చెందిన ధన్‌రాజ్ కూడా బ్లాక్ బెల్ట్ సాధించిన యువకుడే. తండ్రి భీంరాజ్ స్థానిక పారిశ్రామికవాడ లోని మైలాన్ పరిశ్రమలో పని చేస్తారు. 25 అంతర్జాతీయ, జాతీయ స్థాయి టోర్నీల్లో పాల్గొని అవార్డులు సొంతం చేసుకున్నారు. నేటి కాలంలో ప్రతి యువకుడు, యువతి కరాటేలో కొద్ది పాటైనా ప్రతిభ ఉండాలని ఆయన సూచిస్తున్నారు.



- **స్వాతి...** ఐడీఏ బొల్లారానికి చెందిన ఈమె వెంకటేశ్ కూతురు. తండ్రి స్థానిక పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో కార్మికునిగా పని చేస్తాడు. ప్రస్తుతం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఈ బాలిక 10 అంతర్జాతీయ, జాతీయ స్థాయి వేదికలలో ప్రతిభ చూపింది. ప్రతి బాలిక, యువతులు కరాటేలో శిక్షణ పొందితే ఆత్మ రక్షణ సులభమౌతుందని చెబుతోంది.



- **సురేశ్...** మేడ్చల్ జిల్లా షాపూర్‌గనర్‌కు చెందిన బి. సురేశ్ ఐడీఏ బొల్లారంలో ఉంటూ కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించాడు. తండ్రి లేక పోయిన కరాటేలో శిక్షణను కొనసాగిస్తూనే స్థానిక పరిశ్రమలో కార్మికునిగా పని చేస్తున్నాడు. 12 జాతీయ, అంతర్జాతీయ వేదికలపై నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపి అవార్డులు అందుకున్నారు. అనేక ఛాంపియన్ షిప్‌లు సొంతం చేసుకున్నారు.



- **శేఖర్...** బ్లాక్ బెల్ట్ సాధించిన ఈ యువకుడిని ఐడీఏ బొల్లారంలో గుర్తించని వారు లేరంటే అతిశయోక్తి కాదు. పటాన్‌చెరు మండలం గండిగూడెం గ్రామానికి చెందిన దుర్గయ్య కుమారుడు. దాదాపు 20కి పైగా అంతర్జాతీయ, జాతీయ స్థాయి వేదికలపై, 100 వరకు వేదికలపై పోటీలలో పాల్గొని ప్రత్యేక ప్రతిభ చూపారు.

ఏళ్లుగా శిక్షణ..



– పి సునీల్, కోచ్

దాదాపు 20 ఏళ్లుగా ఐడీఏ బొల్లారం కేంద్రంగా వందలాది మంది యువతీ యువకులను కరాటే, కుంగ్‌ఫూ తదితర అంశాలలో శిక్షణను ఇచ్చాం. చాలా మంది పాఠశాలల్లో శిక్షకులుగా పని చేస్తున్నారు. కొందరు సొంతంగా ఇతర ప్రాంతాల్లో శిక్షణా సంస్థలు ఏర్పాటు చేసుకున్నారు. ఆల్ ఇండియా గ్రాండ్ మాస్టర్ సాజిద్ ఇక్కడి విద్యార్థే.

భవితకు అడుగులు



చిమ్నాపూర్ నుంచి కాలినడకన వెళ్తున్న విద్యార్థులు

ఉజ్వల భవిత ఉండాలంటే విద్యార్థి దశే కీలకం. ఈ దశలో రాణిస్తేనే భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలు చేరుకోవటం సాధ్యమవుతుంది. లేదంటే జీవితాంతం కష్టాల కడలిని ఈదాల్సివస్తుంది. అందుకే ఈ చిన్నారులు కాలినడక అయినా ఇష్టంగా నిత్యం బడికి వెళుతున్నారు. కంది మండలం చిమ్నాపూర్ నుంచి మండల కేంద్రమైన కంది ఉన్నత పాఠశాలకు వెళ్లి చదువుకునేందుకు విద్యార్థులు నిత్యం కాలినడకన వెళుతున్నారు. బస్సులు, ప్రైవేటు వాహనాల సదుపాయం లేకపోవటంతో వీరికి నిత్యం రానుపోను రెండు కిలోమీటర్ల మేర నడక తప్పడం లేదు.

– న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్

మళ్లీ ఉల్లి పోటు..!



రోజు రోజుకు పెరుగుతున్న ఉల్లి ధరలు సామాన్య, మధ్యతరగతి ప్రజలకు.. వంటింట్లో కోయక ముందే కంటనీరు తెప్పిస్తున్నాయి. కొద్ది రోజులుగా ఉల్లి ధరలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం విపణిలో నాణ్యమైన ఉల్లి ధర రూ.35 నుంచి రూ.40 వరకు విక్రయిస్తున్నారు. వినియోగంలోనూ ప్రజల నుంచి హోటళ్ల నిర్వాహకుల వరకు జాగ్రత్త పాటిస్తున్నారు. జోగిపేట పట్టణంలోని ఓ హోటల్ నిర్వాహకులు ఇలా.. 'ఒక్కరికి ఒక్క సారి మాత్రమే ఉల్లిగడ్డ వేస్తామని' సూచిక ఏర్పాటు చేశారు. వినియోగదారులు ఇంకా కావాలని అడిగినా.. సున్నితంగా తిరస్కరిస్తున్నారు. ఇందుకు సంబంధించిన చిత్రాలే ఇవి.. – న్యూస్‌టుడే, జోగిపేట టౌన్





పండుగ సందడి.. జిహ్వాకు కట్టడి

- చవితి నుంచి వరుస వేడుకలే
- తీపి పదార్థాలతో అనారోగ్య ముప్పు
- ఆహారం మోతాదు మించకుండా జాగ్రత్తలు

ఈనాడు, హైదరాబాద్

వినాయక చవితి మొదలుకొని ఒకటి తర్వాత ఒకటి వరుసగా పండుగలే పండుగలు. దసరా, దీపావళి...అనంతరం సంక్రాంతి...మధ్య చిన్న చిన్న పండుగలు బోలెడన్ని వస్తుంటాయి. కుటుంబ సభ్యులు, బంధువులతో ఒకటే సందడి. చిన్నా పెద్దా అందరికీ నోరూరించేవి పిండి వంటలే. నేతితో చేసిన గారెలు, బూరెలు, లడ్డూలు...ఇలా ఎన్నో రకాలు...జిహ్వాచాపల్యంతో చాలామంది వీటిని లాగించేస్తుంటారు. ఈ సందడిలో ఎంత తింటున్నారో కూడా మరిచిపోతుంటారు. అప్పటివరకు పాటించిన ఆహార నియమాలన్నీ గాలిలో కలిసిపోతాయి. ఈ రోజుల్లో మితిమీరి తినడం వల్ల శరీరంలోకి మళ్లీ కేలరీలు పోగవుతాయి. పండుగ అంటే పిండి వంటల రుచి చూడాల్సిందే. బెల్లంతో చేసిన అరిసెలు, నేతితో చేసిన మురుకులు, సకినాలు లాంటి సంప్రదాయ వంటలు చిన్నపిల్లలకు ఆరోగ్యకరమే.. అదే పెద్దవాళ్ల విషయంలో మాత్రం కాస్త జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. మధుమేహం, హృద్రోగ సమస్యలతో ఉన్నవారు నూనె, నెయ్యి, చక్కెర అధిక మోతాదులో ఉన్న పిండి వంటల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిందే.

మద్యపానం ప్రమాదమే...

మద్యపాన ప్రియులు పండుగ పేరు చెప్పి స్నేహితులు, బంధువులతో మందు పార్టీల్లో మునిగి తేలుతుంటారు. ఇలా జీర్ణ వ్యవస్థను ఒక్కసారిగా మార్పునకు గురిచేయడం వల్ల ఒక్కోసారి వాంతులు అవడం, కడుపునొప్పి లాంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఊబకాయం, డయాబెటిస్, గుండె జబ్బులు ఉన్నవారు...పండగ పేరుతో అతిగా మద్యం తాగడం, నూనెతో చేసిన పదార్థాలు మితిమీరి తినడంతో దాని ప్రభావం కాలేయంపైనా పడుతుంది. మద్యం అతిగా తీసుకుంటే కొన్నిసార్లు శరీరంలో చక్కెర స్థాయిలు తగ్గిపోతాయి. కొంతమందికి గాల్ బ్లాడర్ సమస్య, కడుపుబ్బడం వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. పండుగ హడావుడిలో వేళాపాళా లేకుండా కొందరు భోజనాలు చేస్తారు. రోజూ తినాల్సిన సమయానికి కాకుండా అర్ధరాత్రి దాటిన తర్వాత తినడం వల్ల రక్తంలో



చక్కెర స్థాయిలు పెరగడం, తీసుకున్న ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోవడం తదితర ఇబ్బందులు తలెత్తుతాయి. కొందరిలో రక్తపు వాంతులు అవుతాయి. కొన్నిసార్లు వాంతి అయిన పదార్థం ఊపిరితిత్తుల్లోకి చేరితే ఊపిరి తీసుకోవడం ఇబ్బంది అవుతుంది. గుండె నొప్పి, బ్రెయిన్‌స్ట్రోక్ వంటి తీవ్ర పరిణామాలకు దారి తీసే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఈ నియమాలు పాటించాలి..

- సాధ్యమైనంత వరకు ఇంటిలో తయారు చేసిన ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఊబకాయం, మధుమేహం, హృద్రోగ సమస్యలు ఉన్నవారు ఎంత తక్కువ మోతాదులో తీసుకుంటే అంత మంచిది.
- పిండి వంటల్లో చక్కెర తక్కువ మోతాదులో ఉన్నవి...పీచు ఉన్న పదార్థాలు మంచిది. అవి కూడా తక్కువ మోతాదులో తీసుకోవాలి.
- పండగ రోజుల్లో అతిథుల రాక ఎక్కువ. మర్యాద కోసం పిండి వంటలు, స్నాక్స్ పెడుతుంటారు. వారితోపాటు మనమూ కూర్చొని తినడం వల్ల మనకు తెలియకుండానే ఎక్కువ మోతాదులో కాలరీలు శరీరంలోకి చేరతాయి.
- రోజూ మాదిరిగానే ఉదయం వేళకు అల్పాహారం, భోజనం తీసుకోవడం వల్ల ఒకవేళ అతిథులు వచ్చినా...వారితోపాటు మనం తినకుండా ఉండేందుకు వీలుంటుంది.
- చక్కెరతో చేసిన పదార్థాలను కళ్లకు కన్పించేటట్లు పెట్టడం వల్ల జిహ్వాచాపల్యం వేధిస్తుంది. వాటిని డబ్బాల్లో పెట్టి ఉంచాలి.
- పిండి పదార్థాలకు బదులు... మంచి పండ్లు, సలాడ్లు తీసుకోవడం వల్ల ఆరోగ్యంతోపాటు ఇతర చిరు తిళ్లపై మనసు మళ్లదు.
- కొంచెం పిండి వంటలు తిన్నా సరే...వాటిని చాలా నెమ్మదిగా తినాలి. దీనివల్ల ఎక్కువ తినేందుకు ఆస్కారం ఉండదు.

సాంకేతిక విద్యాక్షేత్రంలో.. క్రీడా ప్రాంగణం

- రూ.12.9కోట్లతో జీప్లస్2గా ఇండోర్ స్టేడియం నిర్మాణం
- ఇప్పటికే ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఆమోదముద్ర
- జేఎన్‌టీయూలో అర ఎకరంలో నిర్మాణానికి కసరత్తు



ఇండోర్ స్టేడియం కోసం ప్రతిపాదించిన స్థలం ఇదే

అదొక సాంకేతిక విశ్వ విద్యాలయం.. వందలాది ఇంజినీరింగ్ కళాశాలలకు మార్గనిర్దేశం చేసేది అక్కడి నుంచే.. వేలాదిమంది విద్యార్థులు సాంకేతిక విద్యను అభ్యసిస్తుంటారు... అలాగని విద్యకే పరిమితం కాకుండా క్రీడల్లోనూ తమ సత్తా చాటి వర్సిటీకి వన్నె తీసుకొస్తున్న విద్యార్థులు ఎంతోమంది ఉన్నారు... క్రీడా పోటీలు నిర్వహించేందుకు మాత్రం బయటి మైదానాలపై ఆధారపడాల్సిన పరిస్థితి. ఇప్పటివరకు అక్కడ క్రీడాపరంగా మైదానం లేకపోవడంతో అరకొర సదుపాయాలతో నెట్టుకొస్తున్నారు. ఇక్కడి అవసరాలు.. క్రీడలను ప్రోత్సహించేందుకు కావాల్సిన ఏర్పాట్లకు సంబంధించి కొన్నేళ్లుగా క్రీడా విభాగంనుంచి ఉప కులపతులకు వినతులు వెళుతూనే ఉన్నాయి. వాటికి ఊ కొడుతున్నారే తప్ప తరువాత పట్టించుకున్నవారు లేకుండాపోయారు. ఎట్టకేలకు ఇందుకు కసరత్తు మొదలైంది.

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే

కూకట్‌పల్లిలోని జేఎన్‌టీయూహెచ్‌లో ఇంజినీరింగ్, ఇతర పీజీ కోర్సులకు సంబంధించి మొత్తం దాదాపు 4వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. సాంకేతిక విద్యలో మార్గనిర్దేశం చేయడమే కాదు.. మార్గదర్శకులుగా ఉండాలని ఇటీవల వర్సిటీలో పీజీ వసతిగృహం ప్రారంభించిన సందర్భంగా మంత్రి కడియం శ్రీహరి అధికారులకు సూచించారు. అందుకు అనుగుణంగా ప్రణాళిక రూపొందించుకొని క్యాంపస్‌ను తీర్చిదిద్దాలని చెప్పారు. వాస్తవంగా ఇప్పటివరకు వర్సిటీలో క్రీడాపరంగా బయటికి చెప్పుకొనేంతగా సదుపాయాలు లేవనే చెప్పాలి. క్రీడా కాంప్లెక్స్ ఉన్నా అరకొర ఏర్పాట్లతోనే కొనసాగుతోంది. ఏటా వర్సిటీనుంచి వందలాది మంది విద్యార్థులు అంతరవర్సిటీ క్రీడా పోటీలు, రాష్ట్ర, జాతీయస్థాయిలో వివిధ క్రీడా పోటీలకు హాజరై సత్తా చాటుతుంటారు. ఇక ఇక్కడ ఏదైనా టోర్నమెంట్ నిర్వహించాలంటే ఏర్పాట్లు సరిగా లేక ఇబ్బందులు పడుతూవస్తున్నారు. దీన్ని అధిగమించేందుకు ఎట్టకేలకు ముందడుగు పడింది.

ఆమోదం లభించిందిలా..

విశ్వవిద్యాలయంలో అంతర క్రీడా మైదానం కోసం ఎప్పటినుంచో ప్రతిపాదన ఉంది. క్రీడా విభాగం అధికారులు పదేళ్లుగా వచ్చిన ప్రతి వీసీకి ప్రతిపాదనలు పంపుతూనే ఉన్నారు. ఆమోదం మాతకనం ఎవరూ ఇవ్వలేదు. ఇటీవల మరోసారి ప్రతిపాదనను ప్రస్తుత ఉపకులపతి వేణుగోపాల్‌రెడ్డికి అందజేశారు. ఆయన సానుకూలంగా స్పందించి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో చర్చించారు. దీనిపై చర్చించిన ప్రతినిధులు అంతర మైదానం నిర్మాణం అవసరమని గుర్తించి ఆమోదముద్ర వేశారు. దీనికి సంబంధించి మినిట్స్ విడుదల కావాల్సి ఉంది. అది రాగానే అధికారికంగా వర్సిటీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు రంగంలోకి దిగుతారు. ముందుగా కన్సల్టెన్సీతో డిజైన్ తయారుచేయించి తర్వాత టెండర్లు పిలుస్తామని. ఆ వెంటనే నిర్మాణానికి శ్రీకారం చుడతామని ఇంజినీరింగ్ విభాగం చీఫ్ ఇంజినీర్ లక్ష్మణరావు తెలిపారు. వర్సిటీలో అంతర మైదానం అవసరమని గుర్తించడంతోనే ప్రతిపాదనలు పంపామని చెప్పారు.

నిర్మాణం జరిగేది ఇలా..

ఇప్పటికే విశ్వ విద్యాలయం ఆవరణలో అంతర మైదానం కోసం స్థలాన్ని గుర్తించారు. ప్రస్తుత క్రీడాకాంప్లెక్స్ పక్కనే ఉన్న దాదాపు ఎకరం స్థలంలో అర ఎకరానికిపైగా దీని కోసం కేటాయించారు. ఇక్కడ బోర్డు కూడా పాతారు. దానిపై ప్రతిపాదిత ఇండోర్ స్టేడియం అని రాసి ఉంచారు. ఈ స్థలంలో జీప్లస్‌టు అంతస్థుల్లో అంతర మైదానం నిర్మాణం జరుగుతుందని ఈఈ చంద్రశేఖర్, పీడీ గోపీకృష్ణ వివరించారు. తొందరలోనే నిర్మాణం ప్రారంభించే అవకాశముందని పేర్కొంటున్నారు. రూ.12.9కోట్ల కేటాయింపునకు ఈసీ ఆమోదం లభించడంతో తొందరలోనే మరో అడుగు ముందుకు పడే అవకాశాలు ఉన్నట్లు చెబుతున్నారు.

క్రీడా ఏర్పాట్లు ఇవీ..

అంతర మైదానంలో షటిల్, బ్యాడ్మింటన్ కోర్టులు నాలుగు చొప్పున 8ఉంటాయి. షటిల్ కోర్టులు మల్టీపర్పస్‌లో వాడుకునేలా రూపొందించనున్నారు. అవసరమైనప్పుడు వాలీబాల్, బాస్కెట్‌బాల్ ఆడుకునే అవకాశం ఉంటుంది. విశాలమైన టీటీహాల్స్, మహిళలు, పురుషులకు వేర్వేరుగా అధునాతన వ్యాయామశాలలు, క్యారమ్స్, చెస్ ఆడుకునేందుకు ప్రత్యేక గదులు, యోగా కేంద్రం, స్క్వాష్ రాకెట్, విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఒక హాల్ ఉంటాయి. వీటితో పాటు 500మంది క్రీడాకారులు వసతి పొందేలా ప్రత్యేక గదులు, హాళ్లు, మేనేజర్లు, శిక్షకుల కోసం ప్రత్యేక వసతి సౌకర్యం, కాన్ఫరెన్స్‌హాల్, పీడీ ఆఫీసుతో పాటు అన్ని ఏర్పాట్లు ఇందులో ఉంటాయి. ఈత కొలను కోసం కూడా ప్రతిపాదన సిద్ధమవుతోందని పీడీ గోపీకృష్ణ వివరించారు. రాబోయే రోజుల్లో విశ్వ విద్యాలయంలో క్రీడాపరంగా అన్ని రకాల ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు.





ఒక్క ట్వీట్ చాలు..!

పోకిరీలపై పోలీస్ దూకుడు

పెరుగుతున్న ఫిర్యాదుల సంఖ్య

యువతులు.. విద్యార్థినులకు దన్ను

ఈనాడు, హైదరాబాద్

'ఒక్క ట్వీట్ చాలు.. పోకిరీలను పట్టేస్తాం'.. ఇది హైదరాబాద్ పోలీసుల తాజా విధానం.. విద్యార్థినులు.. మహిళలను వేధిస్తోన్న వారిని అరెస్ట్ చేసేందుకు వీలుగా నగరంలోని ప్రతి పోలీస్ ఠాణా ఇన్‌స్పెక్టర్ పేరుతో ట్విట్టర్ ఖాతాలను తెరిచారు. బాధితులెవరైనా సరే ట్విట్టర్‌లో తమ ఆవేదన తెలిపితే చాలు... వెంటనే స్పందిస్తున్నారు. 'షి' బృందాలతో పాటు శాంతి భద్రతల పోలీసులూ ఆకతాయిలను అదుపులోకి తీసుకుని తాట తీస్తున్నారు. వేలమంది విద్యార్థినులు, మహిళలు ట్విట్టర్‌ను వినియోగిస్తుండడంతో పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నారు. బాధితులు లేదా సమాచారం ఇచ్చేవారు ట్విట్టర్ ద్వారా వేధింపుల సమాచారం ఇస్తే చాలు... రహస్యంగా అక్కడికి వెళ్లి పోకిరీలను అరెస్ట్ చేస్తున్నారు. కొద్దిరోజుల వ్యవధిలోనే 126మందిని పట్టుకుని కౌన్సెలింగ్ నిర్వహించారు. తీవ్రత ఆధారంగా కేవలం ట్విట్టర్, వాట్సాప్ ఫిర్యాదుల ద్వారా కేసులు నమోదు చేస్తున్నారు.



సామాజిక మాధ్యమాలు.. లఘుచిత్రాలు

మెట్రో నగరాల్లో మహిళలకు వేధింపులు క్రమంగా పెరుగుతున్నాయి. పోకిరీలు, రౌడీలను ఎదిరిస్తే పరువు పోతుందన్న భావనతో బాధితులు వేధింపులను మౌనంగా భరిస్తున్నారు. చట్టం వీరికి రక్షణగా ఉన్నా పోలీసులంటే భయం కారణంగా వారికి ఫిర్యాదు చేయలేక పోతున్నారు. రెండేళ్ల క్రితం 'షి'బృందాలు ప్రారంభమయ్యాక పరిస్థితిలో కొంత మార్పు వచ్చింది. కొందరు 'షి'బృందాలకు సమాచారం ఇస్తున్నారు. పోలీసులు వేధింపులపై చైతన్య కార్యక్రమాలు నిర్వహించడంతో అవగాహన పెరిగింది. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, బస్‌స్టాప్‌లు, బస్సులు, మహిళా వసతి గృహాలు, షాపింగ్‌మాల్స్‌లో 'షి' బృందాల సభ్యులు వెళ్లి మహిళలతో మాట్లాడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో కరపత్రాలు ఇస్తున్నారు. పోస్టర్లు, స్టిక్కర్లు అంటిస్తున్నారు. ట్రాఫిక్ కూడళ్ల వద్ద డిజిటల్ చిత్రాలను ప్రదర్శిస్తున్నారు. వేధింపులు ఎదుర్కోవాల్సిన అవసరం ఎంత మాత్రం లేదని వారిని చైతన్య పరిచేందుకు లఘుచిత్రాలను రూపొందించారు. వాస్తవిక ఘటనల స్ఫూర్తితో వీటిని చిత్రీకరించారు. చరవాణులు వినియోగిస్తున్న వారి సంఖ్య పెరుగుతుండడంతో వాట్సాప్, ట్విట్టర్ ద్వారా కూడా ఫిర్యాదులు చేసే వెసులుబాటును కల్పించారు. ప్రచారం నిర్వహించినప్పటి నుంచి క్రమంగా ఫిర్యాదులూ పెరుగుతున్నాయి.

వెంటపడి.. భయపెట్టి.. వేధించి...

వేధిస్తున్నవారిని పట్టుకునేందుకు 'షి' బృందాలు పనిచేస్తున్నా.. చరవాణులు, అంతర్జాల ఆధారిత నేరాలకు పాల్పడేవారు విద్యార్థినులు, మహిళలు ఇంకా వేధిస్తూనే ఉన్నారు. తెలిసిన వారున్నా లేకపోయినా.. కేవలం ఫోన్ నంబరుంటే చాలు అసభ్యంగా మాట్లాడుతున్నారు. బాధితులు మాట్లాడక పోయినా, నంబరు గుర్తించి సమాధానం ఇవ్వకపోయినా వేర్వేరు నంబర్లతో ఫోన్ చేసి భయపెడుతున్నారు. పైశాచిక మనస్తత్వం ఉన్న కొందరు నేరగాళ్లు బూతులు తిడుతున్నారు. అసభ్య, అశ్లీల వీడియోలను చరవాణులకు పంపుతున్నారు. మరికొందరు అర్ధరాత్రి దాటాక ఒంటిగంట నుంచి మూడు గంటల వరకు విరామం లేకుండా ఫోన్లు చేస్తూ హింసిస్తున్నారు. ఇలాంటి చిత్రహింసలు ఎదుర్కొంటున్న వారిలో కొందరు వైద్యులు కూడా ఉన్నారు. బహిరంగ ప్రదేశాల్లో వేధించినా, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడినా మారువేషాల్లో ఉండే 'షి'బృందాలు పట్టుకుంటాయి. ఫోన్లు, సామాజిక మాధ్యమాల్లో వేధిస్తే బాధితులు ఫిర్యాదు చేస్తేనే తప్ప పోలీసుల దృష్టికి సమస్య రాదు. బాధితుల నిస్సహాయతను ఆసరాగా చేసుకుని కొందరు నేరగాళ్లు మరింత రెచ్చిపోతున్నారు. బాధితుల చిరునామాలను సేకరించాక వెంటాడి, వేధిస్తున్నారు. దీనిపై బాధితులు మిన్నకుండి పోతుండడంతో ఇంకా కొనసాగుతోంది.

అత్యంత గోప్యం.. సాంత్వన..

చరవాణులు, సామాజిక మాధ్యమాల ద్వారా వేధింపులు ఎదుర్కొంటున్న వారి కోసమే వాట్సాప్, ట్విట్టర్ సేవలను పోలీసులు అందుబాటులోకి తెచ్చారు. నిందితులు మాట్లాడిన మాటలు(రికార్డు చేసుంటే), అసభ్య సందేశాలు, వీడియోలను వాట్సాప్, ట్విట్టర్ ద్వారా పంపితే చాలు. మిగిలిన వ్యవహారమంతా 'షి' బృందం సభ్యులు చూసుకుంటారు. బాధితులు ఎవరికీ చెప్పుకోలేక మధనపడి కుంగి పోకూడదన్న భావనతో ఈ సౌకర్యాన్ని కల్పించారు. బాధితుల వివరాలను పోలీసులు మాత్రమే తీసుకుని వారి పేర్లు ఎక్కడా బహిర్గతం కాకుండా గోప్యత పాటిస్తున్నారు. బాధితుల చరవాణుల నుంచి కాకుండా ఇతర చరవాణుల నుంచి ఫిర్యాదు చేసినా సరే వారితో మాట్లాడి వివరాలు సేకరించి వెంటనే కేసు నమోదు చేస్తున్నారు. ఇంతేకాదు... ట్విట్టర్ ద్వారా పోస్ట్ చేసిన వెంటనే బాధితులతో మాట్లాడి నిందితులు ఎక్కడున్నారు? ఏంచేస్తున్నారన్న వివరాలు అడిగి ఒకవేళ సమీపంలోనే నిందితులుంటే వారిని వెంటనే అదుపులోకి తీసుకునేందుకు వీలుగా అక్కడున్న 'షి'బృందాలకు సమాచారం ఇస్తున్నారు. పోలీసులు బాధితులకు భరోసా ఇస్తుండడం, గోప్యత పాటిస్తుండడంతో క్రమంగా ఫిర్యాదుల సంఖ్య పెరుగుతోందని, ఆరునెలల్లో ట్విట్టర్ ద్వారా 450 ఫిర్యాదులు వచ్చాయని పోలీస్ అధికారులు వివరించారు.

బాధితులిలా... (శాతాల్లో)

13-18 ఏళ్లు:	15
18-25 ఏళ్లు:	60
25-35 ఏళ్లు:	20
35-45 ఏళ్లు:	05



రంగధాముని చెరువు

'నాణ్యత'కు నీళ్లొదిలారు..!

- చెరువులను పరీక్షించడంలో పీసీబీ అలసత్వం
- 185 చెరువులుంటే.. 20లోనే నాణ్యత పరీక్షలు

ఈనాడు, హైదరాబాద్

కర్ణాటక కాలుష్య నియంత్రణ మండలి బెంగళూరులోని నీటి వనరుల పరిస్థితిపై ఓ ప్రత్యేక అధ్యయనం చేసింది. 67 చెరువుల్లోని నీరు తాగేందుకు పనికి రావని తేల్చింది. . చర్యలు తీసుకునేలా ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసింది.



మరి.. మన పీసీబీ అధికారులు ఏం చేస్తున్నారో తెలిస్తే ముక్కున వేలేసుకోకమానరు.. ప్రత్యేక అధ్యయనాల సంగతి దేవుడెరుగు.. చెరువులు, కుంటల్లోని నీటి నాణ్యతను పరీక్షించడంలోనూ అలసత్వం ప్రదర్శిస్తున్నారు.. ఎందుకిలా అంటే సిబ్బంది కొరత, నిధుల లేమిని సాకుగా చూపిస్తున్నారు. కనీసం కాలుష్యపు నురుగతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న నగరవాసుల కష్టాలనైనా చూసి అడుగు ముందుకేయాల్సిన అవసరముందని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు.

కాలుష్య కాసారాలుగా..

నేషనల్ వాటర్ క్వాలిటీ మానిటరింగ్ ప్రోగ్రాం(ఎన్‌డబ్ల్యూఎంపీ) కింద పీసీబీ గ్రేటర్‌లోని 20 చెరువుల్లో నీటి నాణ్యతను పరీక్షిస్తోంది. ఇందుకయ్యే వ్యయంలో కొంత మొత్తాన్ని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి భరిస్తుంది. ఆ జాబితాలో హుస్సేన్‌సాగర్, ఫాక్స్ సాగర్, హస్మత్‌పేట్, రంగధాముని చెరువు, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, నల్ల చెరువు, సరూర్‌నగర్ చెరువు, నూర్ మహమ్మద్ కుంట, నల్ల చెరువు, మల్లాపూర్ ట్యాంక్, నాచారం పెద్ద చెరువు, సఫిల్‌గూడ చెరువు, సరూర్‌నగర్ చెరువు, రాజేంద్రనగర్‌లోని నూర్ మహమ్మద్ కుంట, ప్రేమాజీపేట తదితర నీటి వనరులు ఈ జాబితాలో ఉన్నాయి. ఆయా చెరువుల నుంచి క్రమం తప్పకుండా నీటి నమూనాలను సేకరించి పీహెచ్, టోటల్ డిసాల్వ్‌డ్ సాలీడ్స్(టీడీఎస్), డిజాల్వ్‌డ్ ఆక్సిజన్(డీవో), నైట్రేట్, బయోలాజికల్ ఆక్సిజన్ డిమాండ్(బీవోడీ), ఫాస్ఫేట్, బోరాన్, కోలిఫాం కాలుష్య ఉద్గారాల తీవ్రత స్థాయిని లెక్కిస్తారు. ఆ గణాంకాల ఆధారంగా నీటి వనరులు కలుషితమయ్యాయా.. వాటి పరిస్థితేంటో పరిశీలిస్తారు. ఈ 20 చెరువుల్లో ఒకటి, రెండు మినహా మిగిలినవన్నీ కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి.

ప్రతిపాదనలేవీ..?

చెరువుల నగరంగా భాగ్యనగరం ప్రసిద్ధి. ప్రతి 2.5 కిలోమీటర్ల విస్తీర్ణానికి ఒక చెరువు ఉన్న నగరం మనది. జీహెచ్ఎంసీ పరిధిలోనే సుమారు 20 ఎకరాల విస్తీర్ణం కంటే ఎక్కువగా ఉన్న చెరువుల సంఖ్య 160కి పైగా ఉన్నట్లుగా పర్యావరణవేత్తలు స్పష్టం చేస్తున్నారు. 'పీసీబీ మాత్రం 20 చెరువుల్లోనే నీటి నాణ్యతను పరీక్షిస్తుంది.. సీపీసీబీ నిధులు ఇస్తుంది కనుక తప్పనిసరి పరిస్థితుల్లో వాటిని పట్టించుకుంటున్నారు. లేకపోతే.. అటువైపు చూడకపోయేవాళ్లు' అని విమర్శిస్తున్నారు. ఇదిలా ఉండగా సిబ్బంది కొరత, నిధుల లేమితోనే ఇతర చెరువులపై దృష్టి సారించడం లేదని పీసీబీ అధికారులు వివరిస్తున్నారు. వాస్తవానికి ప్రతి నెలా ఒక్కో చెరువులో నీటి నాణ్యతను పరీక్షించాలంటే నమూనాల సేకరణ, అనాలిసిస్‌కు సుమారు రూ.5వేల వరకు ఖర్చవుతుంది. ఇందులో సగానికంటే ఎక్కువే సీపీసీబీనే భరిస్తుంది.. సిబ్బంది కొరత విషయానికొస్తే.. ప్రతి నెలకు ఒకసారి మాత్రమే నీటి నమూనాల్ని సేకరిస్తారు. కాబట్టి ఉన్నవాళ్లతో ఇబ్బందేం ఉండదు. సీపీసీబీ అనుమతితో కొత్తగా ఇంకొన్ని నీటి వనరులను జాబితాలో చేర్చేందుకు అవకాశముంది. కాకపోతే.. మన పీసీబీ అధికారులు మాత్రం ఆరేళ్ల నుంచి ఇంత వరకు ప్రతిపాదనల్ని పంపలేదు.

సమన్వయం అవసరం

శనివారం కూకట్‌పల్లిలోని ధరణీ కాలనీవాసులు పక్కనే ఉన్న పరికిచెరువు నుంచి వెలువడిన కాలుష్యపు నురగతో నరకం చూశారు. ఇక్కడే కాదు రెండు నెలల వ్యవధిలో 5 చెరువుల్లోనూ ఇదే పరిస్థితి. ఇప్పటికీ అప్రమత్తం కాకపోతే భాగ్యనగరమంతా ఇదే పరిస్థితి ఖాయమని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఎప్పటికప్పుడు నీటి నాణ్యతను పరీక్షించి.. చేయి దాటిపోయిన వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచిస్తున్నారు. ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ కాలుష్యాన్ని తగ్గించుకునేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరముందంటున్నారు. అన్ని కాకపోయినా కనీసం ముఖ్యమైన వాటినైనా జాబితాలో చేర్చాలని కోరుతున్నారు. ఎలాగూ వ్యయాన్ని భరించే ఆర్థిక స్థోమత కాలుష్య నియంత్రణ మండలికి ఉందని.. సిబ్బంది కొరతను అధిగమించేందుకు జేఎన్టీయూ, ఉస్మానియా తదితర విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులను భాగస్వామ్యం చేయాలని సూచిస్తున్నారు.

పర్యావరణహితంగా పరిశ్రమలు కొనసాగాలి

హైదరాబాద్: పర్యావరణ హితంగా పరిశ్రమలు కొనసాగాలని, విద్యుత్, నీరు వంటి వనరులను పొదుపుగా వినియోగించుకునేందుకు అందుబాటులో ఉన్న ఆధునిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని పలువురు పారిశ్రామికవేత్తలు పేర్కొన్నారు. బుధవారం సీఐఐ ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో 16వ ఎనర్జీ ఎఫిషియన్సీ సమ్మిట్‌ను ప్రారంభించారు. పేపర్‌టెక్, గ్రీన్ షుగర్ సమ్మిట్, పవర్‌ప్లాంట్ సమ్మిట్‌ల పేరిట కాగితం, చెక్కర, విద్యుత్ పరిశ్రమలకు సంబంధించి వేర్వేరు అంశాలపై చర్చించారు. ఆయా రంగాల నిపుణులు హాజరై తమ కంపెనీల్లో అనుసరిస్తున్న పర్యావరణహితమైన చర్యలు, విద్యుత్‌పొదుపు విధానాలను వివరించారు. 150 కంపెనీలనుంచి వచ్చిన ప్రతినిధులు ఆయా అంశాలపై సదస్సులో పత్రాలను సమర్పించారు. పర్యావరణ పరంగా వస్తున్న సవాళ్లను ఎదురుకునేందకు కాగితం పరిశ్రమలు మెరుగైన విధానాలను అవలంబించాల్సిన అవసరముందని వివరించారు. కార్యక్రమంలో షుగర్ టెక్నాలజీస్ అసోయేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు సంజయ్ అవస్తి, టాటా పవర్ కంపెనీ చీఫ్ సీటీడీఎస్ ప్రవీణ్ పాల్గొన్నారు.

Junior Inter STUDY PLAN

Zoology

Generally, the aim of a student joined in Intermediate Bi. P. group is to secure a seat in a reputed Medical College to study M.B.,B.S. or other allied Medical Course. To get a seat in M.B.,B.S. one has to face the National Eligibility Entrance Test (NEET) and secure a good rank. Hence, while preparing for Intermediate Public Examination (IPE), critical, analytical and planned study is required.

ప్రతిభ

Tips to tap good score...

In IPE, the Zoology Paper is for 60 marks. Out of the 60 marks, 20 marks are allocated for Very Short Answer Questions [VSAQ : 10 questions × 2 marks], 24 marks are allotted for Short Answer Questions [SAQ : 6 questions × 4 marks] and 16 marks for Long Answer Questions [LAQ : 2 questions × 8 marks]. The syllabus of Zoology is divided into 8 Units. Weightage (approximate) of Marks for each unit is given below:

S. No.	Unit	Marks Allocated
I	Diversity of Living World	06
II	Structural Organisation in Animals	10
III	Animal Diversity - I (Nonchordates)	06
IV	Animal Diversity - II (Chordates)	06
V	Locomotion and Reproduction in Protozoans	08
VI	Biology in Human Welfare	14
VII	*Periplaneta americana* (Type Study)	12
VIII	Ecology and Environment	14

- As there is no choice for VSAQ, all questions should be answered. To answer these questions, all topics are to be understood clearly, read thoroughly and remember the subject matter. Answer for these questions must be direct and brief. For example...

  Q. A person is suffering from bowel irregularity and abdominal pain. His stools contains blood and mucus. Based on these symptoms, name the disease and the causative organism.

  Ans. a. Disease : Intestinal amoebiasis / Amoebic dysentery.

  b. Causative organism: *Entamoeba histolytica*

- Eight SAQ will be given. One has to answer any six in 15-20 lines each. Some questions are related to drawing the diagram and labelling also. Answer for some SAQ may not be in 20 lines and for some, it may be more than 20 lines. Hence, do not count the number of lines. Write the perfect and complete answer. If diagram is asked, draw it with a sharply pointed pencil and label the parts towards right side. If space is not sufficient, write on left side also. Generally diagrams are asked from the units II and VII.
- Regarding LAQ, three questions will be given. You have to answer any two which are familiar to you. Each answer should be in 45-60 lines. Illustrations are also necessary for these questions. This type of questions are selected from the units II, VI, VII and VIII.

Important...

- *Generally for IPE, the questions for public examination are selected from the list of questions given at the end of each unit of BIE / Telugu Akademi Text Book.*
- *While preparing a unit, first read LAQ. They cover some SAQ and VSAQ.*
- *Then read remaining SAQ. They cover some VSAQ. Then read the remaining VSAQ.*



Writer:
K. Sreeramulu
Subject Expert

Syllabus and Questions

I. Zoology - Diversity of Living World

- Generally a two marks question will be given from this unit from branches of Zoology, species, nomenclature etc.
- Four marks question is generally given from basic concepts of classification, species concept and biodiversity.

II. Structural Organisation in animals

- From the topics symmetry-types, body cavity-types two and four marks questions are common. From animal tissues, two and four marks, diagram related questions and sometimes eight marks question may be asked.

III. Animal Diversity - I


- This unit is related to the characters and classification of non-chordates. Two and four marks questions are asked from this unit.
- To study the characters, classification; characters of different classes and examples - one has to prepare tables with the help of your text book. Hence, it becomes easy to remember the features and examples.

IV. Animal Diversity - II


- From this unit two and four marks questions are asked from the characters, classification and examples of chordates.
- As in unit III, prepare tables with the help of your text book. So that it becomes easy to remember the things.

V. Locomotion and reproduction in protozoans

- Generally two and four marks questions will be given from this unit.
- Prepare tables regarding locomotory organelles and examples of protozoans and study them.
- Study the mechanisms of locomotion.
- Practice the diagrams of *Euglena* and *Paramoecium*.
- Read the transverse and longitudinal binary fission and definition of conjugation.



Euglena




Paramoecium

VI. Biology in Human welfare


- As more marks are allocated to this unit, concentrate much on this unit.
- Study the types of parasites, hosts, effects of parasites on their hosts thoroughly.
- Keep special attention on structure, life history and pathogenecity of *Entamoeba histolytica*, *Plasmodium*, *Ascaris* and *Wuchereria*.
- Also study the symptoms, causative organism and control of typhoid, Pneumonia, common cold and ring worm disease besides TDA abuse.
- All the three types of questions will be given in this unit.

VII. *Periplaneta americana* (Cockroach)

- This unit contains structure, locomotion and body systems of cockroach.
- From the body systems eight marks question may be asked.
- Practice all diagrams thoroughly for a four marks question.
- As this unit is also allocated by more marks, much attention is needed.



Salivary glands of Cockroach



Mouth parts of Cockroach

VIII. Ecology and Environment

- Like units VI and VII, for this unit also more marks are allotted. At the same time, quantity of subject matter is also more.
- As all the topics are related the activities going on around us, understanding these topics is very easy and interesting also.
- Different definitions, abiotic factors in ecosystem and their effects on organisms; population interactions, adaptations, food chains, food web, energy flow, nutrient cycles, pollution etc. need special attention.
- All the three types of questions will be given in this unit.
- While reading concentrate your mind on the Lesson. Victory is yours.

Remember...

- ✓ You have to read more and more. To acquire good knowledge on particular topics you have to read more. Make note of points of what you read. Because it's all about Latin and Greek terms and terminologies in Zoology.
- ✓ Get the latest edition of Zoology Text Book Published by the Telugu Akademi / Board of Intermediate Education for reference and thorough study of the topics.
- ✓ You have to practice a much. Write the answers again and again. It seems laborious and old fashioned but one advantage through practice is you can improve your writing skills and your writing speed increases.
- ✓ An important aspect in Zoology is diagrams. Diagrams are the key factors during your exam preparation. If you study a topic straight, you might not understand it, but with diagram, the same concept can understood well. And during exams, one method which would more appropriate is, draw the diagram first, you can explain the concept easily referring to the diagram, chances of missing the points will be less.
- ✓ Develop patience. Every concept cannot be easily understood. If any concept is taking more time, leave it and begin with easy one. It will build your confidence and you can take on the earlier concept with ease.
- ✓ Start preparing as early as possible. Do not wait till the end. Opening the book at the last moment makes you panic and results in great disappointment.

Send your feedback to
pratibhadesk@eenadu.net

For Tenth, Intermediate Study material please visit...
www.eenadupratibha.net

భారతదేశంలో ఆర్థిక సంస్కరణలు

సంస్కరణలకు పూర్వం భారతదేశంలో వృద్ధిరేటు అల్పంగా, అసంతృప్తికరంగా ఉండేది. దీనికి కారణం ప్రభుత్వరంగ సంస్థల అసమర్థత, ప్రయివేటు రంగంపై నియంత్రణలు, విదేశీ మూలధనం, విదేశీ పెట్టుబడులపై ఉన్న ఆంక్షలు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో 1991 ప్రారంభంలో భారతదేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంది. 1980 దశకంలో భారత ప్రభుత్వం అమలు చేసిన సురక్షితంకాని స్థూల ఆర్థిక విధానాలే ఆర్థిక అసమతౌల్యానికి దారితీశాయి. 1980-81 లో స్థూల దేశీయోత్పత్తిలో 5.1 శాతంగా ఉన్న కోశలోటు 1990-91 నాటికి 7.8 శాతానికి చేరుకుంది. ఈ లోటు సర్దుబాటు కోసం ప్రభుత్వం దేశీయ రుణ సమీకరణ చేసింది. 1980-81 లో ఈ రుణం స్థూల దేశీయోత్పత్తిలో 30 శాతం కాగా, 1990-91 నాటికి 50 శాతానికి చేరింది. ఇంతేకాకుండా విదేశీ వ్యాపార చెల్లింపుల శేషపు కరెంట్ ఖాతా లోటు 1980-81 లో స్థూల దేశీయోత్పత్తిలో 1.39 శాతం లేదా 2 బిలియన్ డాలర్లు కాగా, 1990-91 నాటికి 3.9 శాతం లేదా 9.7 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఈ విపత్కర పరిణామాల కారణంగా భారత ప్రభుత్వ విదేశీ రుణం 1980-81 లో జీడీపీలో 12 శాతం ఉండగా, 1990-91 నాటికి 23 శాతానికి చేరింది. విదేశీ మారక నిధులు కేవలం ఒక వారానికి సరిపడే దిగుమతుల స్థాయికి పడిపోయాయి. ద్రవ్యోల్బణం 1980-81 లో 6.7 శాతం నమోదు కాగా 1990-91 నాటికి 10 శాతానికి చేరుకుంది. దీనికి తోడు 1990 ఆఖరి దశకంలో ఏర్పడిన గల్ఫ్ సంక్షోభం పెట్రోలు ధరల పెరుగుదలకు కారణమై ఆర్థిక సంక్షోభాన్ని మరింత తీవ్ర స్థాయికి చేర్చింది.

ఆర్థిక సంక్షోభాన్ని నివారించి అంతర్గత, బహిర్గత నమ్మకపు స్థాయిని నిలబెట్టుకోవడానికి అప్పటి ప్రధాని పి.వి.నరసింహారావు, ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ చొరవతో 1991 లో ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టారు. అందుకే వీటిని 'రావు-మన్మోహన్ నమూనా' అని కూడా పిలుస్తారు. ఈ సంస్కరణల ఫలితంగా భారతదేశ ఆర్థిక వ్యవస్థలో చెప్పుకోదగ్గ స్థాయిలో విధానపరమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రభుత్వం ప్రపంచస్థాయిలో దేశం శీఘ్రతర ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా సరళీకరణ, ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ (LPG) విధానాన్ని అమలు చేసింది.

ఆర్థిక సంస్కరణల లక్ష్యాలు

- ఎ) కోశ లోటును, రెవెన్యూ లోటును తగ్గించడం.
- బి) ప్రభుత్వరంగ పరిధిని తగ్గించి, ప్రయివేటు రంగానికి అప్పగించడం.
- సి) పారిశ్రామిక లైసెన్సులు ఎత్తివేయడం.
- డి) విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించడం, విదేశీ వ్యాపారంలో సుంకాలు, కోటాలు ఎత్తివేయడం.
- ఇ) ఆర్థిక వృద్ధిరేటును పెంచడం.
- ఎఫ్) సంపూర్ణ ఉద్యోగితను సాధించడానికి ఉపాధిని విస్తరించడం.
- జి) పేద, ధనిక వర్గాల మధ్య వ్యత్యాసాలు తగ్గించడం.
- హెచ్) దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న జనాభాను తగ్గించడం.
- ఐ) ప్రాంతీయ అసమానతలు తగ్గించడం.

సంస్కరణల్లోని ముఖ్యాంశాలు

1980 వ దశకం మధ్యలో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం విదేశీ వర్తకం, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, విదేశీ మూలధనంపై ఆంక్షలను సడలించడానికి ప్రయత్నించినప్పటికీ, పూర్తిస్థాయి సంస్కరణలు మాత్రం 1991 లోనే జరిగాయి. ఈ నూతన ఆర్థిక సంస్కరణలను రెండు విధాలుగా చెప్పవచ్చు. 1) స్వల్పకాలానికి సంబంధించిన స్థూల ఆర్థిక స్థిరీకరణ చర్యలు, 2) దీర్ఘకాలానికి సంబంధించిన నిర్మాణాత్మక సర్దుబాటు చర్యలు.

స్థూల ఆర్థిక స్థిరీకరణ చర్యలు

ఆర్థిక వ్యవస్థలో వెంటనే సర్దుబాటు చేసేందుకు ఉపయోగించిన ఈ చర్యలనే డిమాండ్ నిర్వహణ చర్యలు అంటారు. దీనిలో భాగంగా ద్రవ్య సప్లయ్‌ని తగ్గించడం ద్వారా ద్రవ్యోల్బణాన్ని తగ్గించడం, కోశ సర్దుబాటు చర్యల్లో భాగంగా రాబడిని పెంచి, వ్యయాలను తగ్గించడం, విదేశీ చెల్లింపుల్లో లోటును తగ్గించేందుకు మూల్యహీనీకరణ లాంటి చర్యలను సూచించారు.

వీటిలో ప్రధానంగా పన్ను రాబడిని పెంచేందుకు 1991, 1998 లలో రాజా చెల్లయ్య కమిటీని, ప్రణాళికేతర వ్యయాన్ని తగ్గించేందుకు 2000 లో గీతాకృష్ణన్ కమిషన్‌ను నియమించారు. ఇవేకాకుండా పన్నేతర రాబడిని పెంచేందుకు నీటిపారుదల, విద్యుత్, రోడ్లు మొదలైన వాటిపై యూజర్ చార్జీలు విధించారు. కోశలోటును తగ్గించేందుకు భారత ప్రభుత్వం 2003 లో 'కోశ సంస్కరణల బడ్జెటరీ నిర్వహణ చట్టాన్ని' (FRBM) ప్రవేశపెట్టింది. దీనిలో భాగంగా అన్ని రాష్ట్రాలు రెవెన్యూ లోటును 2008–09 నాటికి 0 శాతానికి, కోశలోటును 3 శాతానికి తగ్గించగలగాలి. ఈవిధంగా తగ్గించిన రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తుంది. విదేశీ వ్యాపార చెల్లింపుల్లో లోటును తగ్గించేందుకు 1991 జులై 1, 3 తేదీల్లో రెండు సార్లు మూల్యహీనీకరణ (18% నుంచి 19% మేరకు) చేశారు.

భారతదేశంలోని ఆర్థిక సంస్కరణలను మూడు ప్రతిపాదనలకు సంబంధించిన అంశంగా పరిగణించాలి. అవి: ప్రయివేటీకరణ, సరళీకృత విధానాల అమలు, ప్రపంచీకరణ. ప్రయివేటీకరణ - ప్రభుత్వరంగ సంస్థలు, విధులను ప్రయివేటు రంగపరం చేయడాన్ని తెలుపుతుంది. సరళీకృత విధానాలు - ప్రభుత్వ ఆంక్షలు, నియంత్రణలను సడలించి పారిశ్రామిక, ద్రవ్య, విత్త, విదేశీ విధానం, విదేశీ పెట్టుబడుల్లో ఉదార వైఖరిని పాటించడాన్ని వివరిస్తాయి. ప్రపంచీకరణ - మూలధనం, సాంకేతిక విజ్ఞానం, వస్తుసేవలు, శ్రామిక గమనశీలతపై ఆంక్షలను తొలగించి స్వేచ్ఛా విధానం ద్వారా 'విశ్వ గ్రామానికి' మార్గం సుగమం చేయడాన్ని సూచిస్తుంది.

ప్రతిభ

ప్రపంచీకరణ అంటే ఏమిటి...?

జనరల్ స్టడీస్
ఇండియన్ ఎకానమీ

నిర్మాణాత్మక సర్దుబాటు చర్యలు

ఇవి దీర్ఘ కాలానికి చెందినవి. సప్లయ్ ఆర్థిక వ్యవస్థకు సంబంధించినవి. దీనిలో భాగంగానే భారత ప్రభుత్వం సరళీకరణ, ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ అనే మూడు విధానాలను ప్రవేశ పెట్టడానికి కృషిచేసింది.

సరళీకరణ (Liberalisation)

ప్రభుత్వం నియంత్రిత, కేంద్రీకృత ఆర్థిక వ్యవస్థకు స్వేచ్ఛను కల్పించడాన్ని 'సరళీకరణ' అంటారు. అంటే ప్రభుత్వ జోక్యం తగ్గించి, మార్కెట్ శక్తులకు స్వేచ్ఛను కల్పించడం. లైసెన్సులు, పెట్టుబడి లాంటి విషయాల్లో సరళీకరణ వైపు మొగ్గుచూపారు. సంస్కరణలకు పూర్వం ఏ పరిశ్రమ స్థాపించాలన్నా ప్రభుత్వం నుంచి లైసెన్సులు పొందాల్సి వచ్చేది. కానీ, 1991 ఆర్థిక సంస్కరణల్లో భాగంగా, సరళీకరణ విధానం ద్వారా 18 రకాల పరిశ్రమలు మినహా మిగతా వాటికి లైసెన్సులు ఎత్తివేశారు. ప్రస్తుతం వీటి సంఖ్యను ఆల్కహాలు, సిగరెట్లు, ప్రమాదకర రసాయనాలు, రక్షణ పరికరాలు, పారిశ్రామిక పేలుడు పదార్థాల్లాంటి 5 పరిశ్రమలకు పరిమితం చేశారు.

విదేశీ పెట్టుబడులపై పరిమితిని సవరించారు. 49 శాతం అనే పరిమితిని ఎత్తివేశారు. చాలా పరిశ్రమల్లో 74 శాతం వరకు, కొన్ని గుర్తించిన పరిశ్రమల్లో 100 శాతం విదేశీ పెట్టుబడులను ఆహ్వానించారు. గనులు, పోర్టులు, టూరిజం, తేయాకు, కాఫీ, రబ్బరు లాంటి తోట పంటలు, కొరియర్ సేవలు లాంటి వాటిలో 100 శాతం విదేశీ పెట్టుబడులను అనుమతించారు.

ఏకస్వామ్యాల నియంత్రణ చట్టం (MRTP) పరిశ్రమల స్థాపన, విస్తరణకు అవరోధంగా మారిందని గుర్తించి సరళీకరణలో భాగంగా దీన్ని సవరించారు. మౌలిక రంగాలను ప్రభుత్వ రంగానికి పరిమితం చేసి, ఇతర పరిశ్రమల్లో ప్రయివేటు పెట్టుబడులను ప్రోత్సహించారు. పారిశ్రామిక తీర్మానాల్లో పరిశ్రమలను అత్యంత ప్రభావితం చేసిన వాటిలో 1991, జులై 24 న ప్రవేశపెట్టిన తీర్మానం ప్రధానమైంది. ప్రపంచీకరణ భావాలు దీనిపై ప్రభావం చూపాయి. ఆర్థిక సంస్కరణల్లో భాగంగా విదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకోవడానికి విధానాలను సరళతరం చేశారు. 1991 నుంచి విదేశీ మారక నియంత్రణ చట్టాన్ని (FERA) సడలిస్తూ, విదేశాల్లో భారతీయులు జరిపే లావాదేవీల విషయంలో స్వేచ్ఛను పెంచారు. చివరకు FERA ను 1999 లో విదేశీ మారక నిర్వహణ చట్టం (FEMA) గా మార్చారు. FEMA ను 2000 జూన్ 1 నుంచి అమల్లోకి తెచ్చారు.

ప్రయివేటీకరణ (Privatisation)

గత రెండున్నర దశాబ్దాలుగా ఎంతో ప్రాచుర్యం పొందిన పదం ప్రయివేటీకరణ. దీనికి అర్థం ప్రజల జీవన ప్రమాణాలను ప్రభావితం చేసే కార్యకలాపాల నుంచి ప్రభుత్వం వైదొలగి, మార్కెట్ వ్యవస్థను పటిష్టం చేయడం. పబ్లిక్ సంస్థల యాజమాన్యం, నిర్వహణ భారాన్ని ప్రయివేటుపరం చేసే ప్రయివేటీకరణ ప్రక్రియను 1969 లో ఆచార్య పీటర్ డ్రకర్ తన 'The Age of Discontinuity' లో ప్రస్తావించారు. 1980 లో మార్గరెట్ థాచర్ ఇంగ్లండ్‌లో పబ్లిక్ రంగ సంస్థలను ప్రయివేటు సంస్థలకు అప్పగించే ప్రక్రియ చేపట్టడంతో ఈ భావన ప్రాచుర్యంలోకి వచ్చింది.

1980 లలో మన దేశంలో కొన్ని రంగాల్లో ప్రయివేటీకరణ ప్రవేశ పెట్టినప్పటికీ ఆశించిన ఫలితాలనివ్వలేదు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ పరిణామాలు, దేశంలో ఏర్పడిన ఆర్థిక సంక్షోభం కారణంగా 1991 లో ప్రవేశపెట్టిన నూతన ఆర్థిక విధానం ప్రయివేటీకరణ ప్రక్రియకు పెద్దపీట వేసింది. పబ్లిక్‌రంగ సంస్థల యాజమాన్యం, ఆస్తులు ప్రయివేటుపరం చేయడం వల్ల సంస్థ యాజమాన్య సామర్థ్యం మెరుగుపడి, ఆర్థిక సమర్థత పెరుగుతుందన్న వాదం బలపడింది.

ప్రయివేటీకరణ ప్రక్రియను మన దేశంలో Disinvestment, ఇంగ్లండ్‌లో Denationalisation, ఆస్ట్రేలియాలో Prioritisations, బొలీవియాలో Industrial transition, బ్రెజిల్‌లో Destatisations, న్యూజిలాండ్‌లో Assets Sales Programme అనే భావనల ద్వారా అమలుచేస్తున్నారు.



రచయిత
సీహెచ్. వెంకట్ రెడ్డి
అసిస్టెంట్ ప్రొఫెసర్

1991 లో ప్రయివేటీకరణలో భాగంగా ప్రభుత్వానికి కేటాయించిన పరిశ్రమలను ప్రయివేటు రంగానికి అప్పగించారు. తద్వారా ప్రభుత్వ రంగానికి కేటాయించిన పరిశ్రమలను 8 కి తగ్గించారు. ప్రస్తుతం ఈ పరిశ్రమల సంఖ్యను 2 కి తగ్గించారు. అణుశక్తి, రైల్వే రవాణా మినహా మిగతా అన్ని పరిశ్రమలను ప్రయివేటు రంగంలో స్థాపించుకోవచ్చు.

ప్రయివేటీకరణలో భాగంగానే ప్రభుత్వరంగ సంస్థల్లోని పెట్టుబడుల ఉపసంహరణ విధానాన్ని రూపొందించారు. ప్రభుత్వరంగ సంస్థల్లో ప్రభుత్వానికి ఉన్న వాటాలను ప్రజలకు, సంస్థలకు, మ్యూచువల్ ఫండ్స్‌కు అమ్మివేయడాన్ని 'పెట్టుబడుల ఉపసంహరణ' (Disinvestment) అంటారు. వ్యూహాత్మకంకాని ప్రభుత్వరంగ సంస్థల్లో భారీగా పేరుకుపోయిన ప్రభుత్వ వనరులను సాంఘిక రంగం వైపు మళ్లించడం, మితిమీరుతున్న ప్రభుత్వ రుణ భారాన్ని తగ్గించే లక్ష్యంతో పెట్టుబడుల ఉపసంహరణ విధానాన్ని ప్రవేశపెట్టారు. పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా వచ్చిన నిధులను 75 శాతం సాంఘిక సేవలపై, మిగిలిన 25 శాతం లాభాలు వచ్చే ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడులు పెడతామని ప్రభుత్వం హామీ ఇచ్చింది.

ప్రభుత్వం అనుసరించే సరైన పెట్టుబడుల ఉపసంహరణ వ్యూహాన్ని సూచించమని ప్రొఫెసర్ రంగరాజన్ అధ్యక్షతన 1992 లో కమిటీని నియమించారు. అదేవిధంగా దీర్ఘకాలంలో ఉత్తమమైన పెట్టుబడుల ఉపసంహరణ కార్యక్రమాన్ని సూచించేందుకు జి.వి.రామకృష్ణ అధ్యక్షతన 1996 లో పెట్టుబడుల ఉపసంహరణ కమిషన్‌ను నియమించారు. తర్వాత దీన్ని పునర్ వ్యవస్థీకరించి ఆర్.హెచ్.పాటిల్ అధ్యక్షతన కమిషన్‌ను నియమించారు. పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియను వేగవంతం చేయడానికి ఎన్డీయే ప్రభుత్వం 2000 లో పెట్టుబడుల ఉపసంహరణ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసింది.

ప్రపంచీకరణ (Globalisation)

వస్తుసేవలు, మూలధనం, సాంకేతిక విజ్ఞానం, శ్రామికుల ప్రవాహానికి ఎలాంటి అవరోధాలు ఏర్పడకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను అనుసంధానం చేసే ప్రక్రియను ప్రపంచీకరణగా వ్యవహరిస్తారు. ప్రపంచీకరణ నాలుగు అంశాల పరిధిలో జరుగుతుంది.

- ఎ) వాణిజ్య అవరోధాలు తగ్గించి, వివిధ దేశాల మధ్య వస్తుసేవల ప్రవాహానికి ఉన్న ఇబ్బందులను తొలగించడం.
- బి) సాంకేతిక విజ్ఞాన ప్రవాహానికి అనుకూల వాతావరణాన్ని కల్పించడం.
- సి) మూలధన ప్రవాహానికి అనుకూల వాతావరణం కల్పించడం.
- డి) శ్రామిక గమనశీలతను పెంచడానికి అనుకూలంగా ప్రోత్సహించడం.

ఆచార్య జగదీశ్ భగవతి 'దేశ ఆర్థిక వ్యవస్థను అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానం చేసి వ్యాపారం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, స్వల్పకాల మూలధనం, మానవ వనరులు, సాంకేతిక విజ్ఞాన ప్రవాహాన్ని కొనసాగించడాన్ని స్వేచ్ఛా ఆర్థిక ప్రపంచీకరణ'గా నిర్వచించారు. 'దేశాల రాజకీయ సరిహద్దులను దాటి ఆర్థిక కార్యకలాపాలను విస్తరించడమే ప్రపంచీకరణ' అని దీపక్ నాయర్ నిర్వచించారు.

ప్రపంచీకరణ లక్షణాలు

- ఎ) అంతర్జాతీయ ద్రవ్య వ్యవహారాల్లో వేగవంతమైన వృద్ధి.
- బి) వ్యాపార రంగంలో వృద్ధి వేగం సాధించడం, ప్రత్యేకించి బహుళజాతి సంస్థల వ్యాపార వృద్ధి.
- సి) బహుళ జాతి సంస్థల ద్వారా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో పెరుగుదల.
- డి) గ్లోబల్ మార్కెట్ల ఆవిర్భావం.
- ఇ) రవాణా, కమ్యూనికేషన్ రంగాల శీఘ్రతర వృద్ధి వల్ల సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తరించడం.

ప్రపంచీకరణ దిశగా చర్యలు

భారతదేశం ప్రపంచీకరణ దిశగా మూడు ముఖ్యమైన చర్యలను చేపట్టింది. i) రూపాయి బహిర్గత విలువ సవరణ, రూపాయి పరివర్తనం.

ii) దిగుమతుల సరళీకరణ.


iii) వివిధ దేశీయ ఉత్పత్తి రంగాల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం.

విదేశీ మారక ద్రవ్య మార్కెట్లో ప్రభుత్వ జోక్యం లేకుండా డిమాండ్, సప్లయ్ శక్తుల ద్వారా ద్రవ్యం విలువను నిర్ణయించడాన్ని ప్రపంచీకరణ ప్రక్రియలో అతి ముఖ్యమైన చర్యగా పరిగణిస్తున్నారు. 1991 లో నూతన ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టిన తర్వాత రూపాయిని పరివర్తనం చేసే ప్రయత్నం జరిగింది. ఈ దిశగా భారత ప్రభుత్వం రెండు దశల్లో జులై 1, 3 తేదీల్లో రూపాయి విలువను 18-19 శాతం వరకు తగ్గించి, మూల్యహీనీకరణ చేసింది.

ఆ తర్వాత సంపూర్ణ పరివర్తనం (Full Convertability) లక్ష్యాన్ని చేరుకునే ప్రయత్నంలో పురోగమన చర్యలు చేపట్టింది. 1992-93 బడ్జెట్‌లో పాక్షిక పరివర్తనం ద్వారా ద్వంద్వ మారకరేటు విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ పద్ధతిలో 40 శాతం విదేశీ మారక ద్రవ్య సంపాదనలను అధికార రేటు వద్ద, మిగిలిన 60 శాతం విదేశీ మారక ద్రవ్య సంపాదనలను మార్కెట్ నిర్ణయించిన రేటు వద్ద ఎగుమతిదారులు పరివర్తనం చేసుకున్నారు. 1993-94 బడ్జెట్‌లో వాణిజ్య ఖాతా లావాదేవీల ద్వారా పొందిన మారకపు ద్రవ్యాన్ని సంపూర్ణంగా (మార్కెట్ నిర్ణయించిన రేటు వద్ద) పరివర్తనం చేసుకునే అవకాశం కల్పించింది. 1994 ఆగస్టు 19 న వర్తమాన ఖాతా లావాదేవీలకు సంపూర్ణ పరివర్తనాన్ని ప్రవేశపెట్టింది.



జీవితం అంటేనే పోరాటం, అది ఎప్పుడూ ధర్మం వైపునే ఉండాలి
– గౌతమ బుద్ధుడు



పదమూడేళ్ల పిల్లాడు... యోగా గురువయ్యాడు!



■ **ఎవరీ పిల్లాడు? మన పేజీలోకి ఎందుకొచ్చాడు?**

బోలెడు ఆసనాలు నేర్పించే యోగా గురువు. ఇంత వరకే అయితే చెప్పక్కర్లేదు. మన దగ్గర చిన్నారులు యోగా నేర్చుకోవడం మామూలే కావచ్చు. కానీ ఈ అబ్బాయిది మనదేశమే కాదు. అందుకే మన పేజీలోకి వచ్చాడు మరి.

■ **మరి పేరేంటీ? ఊరేంటీ?**

ఈ అబ్బాయి పేరు అడమ్ అవిన్. వయసు పదమూడేళ్లు. ఉండేది అమెరికా ఫ్లోరిడాలోని ఫోర్ట్ లాడెర్‌డేల్.

■ **అసలీ అబ్బాయి యోగా ఎక్కడ నేర్పిస్తాడు?**

పొద్దున్నే టీవీలో యోగా నేర్పించడం చూసే ఉంటారుగా. అలా ఈ పిల్లాడు కూడా ఇక్కడి 'చిల్డ్రన్స్ టెలివిజన్ నెట్‌వర్క్'లో చిన్నారులకు యోగాసనాలు చెబుతుంటాడు. ఈ కార్యక్రమానికి 'వుఫ్ శాంతి' అని పేరు కూడా పెట్టారు. పిల్లలకు బొమ్మలంటే తెగ ఇష్టం కదా... అందుకే అడమ్... పెద్ద కుక్కబొమ్మలాంటి దుస్తులు వేసుకుని టెడ్డీబేర్‌లా వస్తాడు. కెమెరా ముందు అక్కడున్న చిన్నారులకు రకరకాల ఆసనాలు నేర్పిస్తాడు. మంచి మంచి విషయాలు చెబుతుంటాడు. ప్రస్తుతం అక్కడ ప్రసారమయ్యే ఈ యోగా కార్యక్రమానికి ఆదరణ బాగా పెరిగిపోయిందట. అందుకే త్వరలో అమెరికా మొత్తం ప్రసారాలు చేయనున్నారు. ఫ్లోరిడాలో 'అతి చిన్న యోగా గురువు'గా పేరు తెచ్చేసుకుని ఫేస్‌బుక్‌ల్లాంటి వాటిల్లో వేల మంది అభిమానుల్ని తెచ్చేసుకున్నాడీ బుల్లి గురువు. అంతేకాదూ... చిన్నారుల ఆసుపత్రులకు వెళ్లి వాళ్లు సంతోషంగా ఉండటానికి సరదాగా యోగాసనాలు నేర్పిస్తున్నాడట.

■ **ఇంతకీ అడమ్‌కీ యోగాపై ఆసక్తి ఎలా వచ్చింది?**

అడమ్ వాళ్ల తాతయ్య 'నువ్వు నవ్వితే ప్రపంచమూ నవ్వుతుంది', 'నవ్వుతూ కృతజ్ఞతలు చెప్పాలి', 'మంచిగా ఆలోచిస్తే మంచే జరుగుతుంది' అనే మూడు మంత్రాలు చెప్పాడట. వాటి ప్రాముఖ్యతను అందరికీ చెప్పడానికి ఈ అబ్బాయి యోగా నేర్చుకుని పిల్లలకు చెప్పడం మొదలుపెట్టాడట. అడమ్ వాళ్ల అమ్మ రాసిన 'మై గ్రాండ్-డాగ్ వజ్ ఎ యోగా ఇన్‌స్ట్రక్టర్' పుస్తకానికి ఈ బుల్లి గురువు బొమ్మ కూడా వేశాడు. అచ్చం ఆ బొమ్మ వేషంలోనే తయారై టీవీలో యోగా చెప్పేస్తున్నాడన్నమాట.

■ **మరి మనం చూడలేమా?**

చక్కగా చూడొచ్చు. యూట్యూబ్‌లో ఈ కార్యక్రమానికి చెందిన వీడియోలున్నాయి. ఇంకా... త్వరలోనే యాపిల్ టీవీ, అమెజాన్ ఫైర్ టీవీ స్టిక్, సామ్‌సంగ్ స్మార్ట్ టెలివిజన్‌ల్లో ఈ యోగా గురువు కనిపించబోతున్నాడట.





వడ్రంగి పిట్ట దాని ముక్కుతో చాలా వేగంగా చెట్టుకు రంధ్రం చేసేయగలదు. ఒక్క సెకెనులో అది ఏకంగా 20 సార్లు చెట్టుని పొడిచేయగలదంటే నమ్మగలరా?

కవలలేరి?









పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- Quip = ఎగతాళి
- మాతృక = అసలు గ్రంథం

నవ్వుల జల్లులు!

బిట్టు: అక్కా! కంచంలో భోజనంతో పాటు రెండు స్పూన్లు కూడా వేశావెందుకు?

అక్క: నువ్వే కదరా రెండు స్పూన్లు నెయ్యి వెయ్యమన్నావు!

– డి. శ్రీలత, హైదరాబాద్

తల్లి: చింటూ! బొంబాయి రవ్వ తీసుకురా ఉప్మా చేసి పెడతా...

చింటు: ఇప్పుడు నేనొక్కడినే బొంబాయి వరకూ ఎలా వెళతానమ్మా!


– మా.శ్రీ. రాజు, పాల్వంచ

చిలిపి ప్రశ్న

తెల్లకోడిపుంజు గుడ్డు ఏ రంగులో ఉంటుంది?

– ఆర్. శ్యామల, హైదరాబాద్

దారేది?



సుడోకు


ఈ సుడోకును 1 నుంచి 9 వరకు అంకెలతో నింపాలి. ప్రతి అడ్డు, నిలువు వరుసల్లోనూ, 3X3 చదరాల్లోనూ అన్ని అంకెలూ ఉండాలి. ఏదీ రెండుసార్లు రాకూడదు.

2			4					
		6			7			3
	7	3	8	6		4		
4	2				1		3	
3				9				7
	6		2				9	8
		4		2	5	3	1	
6			3			5		
					4			2

రాయగలరా?

ఆధారాలతో ఆంగ్ల పదాలు రాసి రంగు గడుల్లోని అక్షరాల్ని వరుసగా చదివితే ఓ పదం వస్తుంది

ఆధారాలు:
1. హంస 2. కోతి
3. ఎలుక 4. పాము
5. గుడ్లగూబ 6. గాడిద



జవాబు: ఇవన్నీ కూడా... మెల్లగా వీచే గాలిలో ఒక్కసారిగా మార్పులు రావడం ద్వారా గాలి వేగం మోతాదు పెరిగిపోవటం వల్ల తలెత్తే భారీ ప్రకృతి వైపరిత్యాలే. ఇవి పరిసరాల్ని నాగరిక జీవనాన్ని అతలాకుతలం చేస్తాయి. అయితే హరికేన్‌లు, టైఫూన్‌ల మధ్య తేడాని సాధారణంగా గాలి వేగాన్ని బట్టి విడమరుస్తారు. గాలివేగం గంటకు వంద కిలోమీటర్లను మించితే అది హరికేన్. గాలివేగం అంతకన్నా తక్కువగా ఉన్నట్లయితే టైఫూన్లు అంటారు. సైక్లోన్లు అంటే సముద్ర ఉపరితలంలో అల్పపీడన ద్రోణులు ఏర్పడ్డప్పుడు.... గాలి భూభాగం నుంచి సముద్రంలోకి వెళ్లి అక్కడ నీటి ఆవిరిని నింపుకుని తిరిగి తీర ప్రాంతాలకు చేరి ఉధృతమైన వర్షపాతానికి దారి తీస్తుంది. బంగాళాఖాతం, హిందూ మహా సముద్రాల్లో ఇలాంటి ద్రోణులు ఎక్కువగా ఏర్పడుతుంటాయి. గాలిలో పీడనాలు మారినా లేదా సైక్లోన్ల ద్వారా పెనుగాలులు వీచినట్లయితే వాటిని తుపాన్లు అంటుంటారు. శాస్త్రీయంగా ఈ నాల్గింటి మధ్య కచ్చితమైన వ్యత్యాసం లేదు. అమెరికా, మధ్య అమెరికా ప్రజలు అన్ని రకాల గాలి దుమారాల్నీ హరికేన్‌లు, టైఫూన్లు అంటుంటారు. ఆసియాలోని మనం వీటిని తుపానులు, సైక్లోన్‌లు అంటాం.

– ప్రొ॥ ఎ. రామచంద్రయ్య, నిట్, వరంగల్; ఎడిటర్, చెకుముకి, జనవిజ్ఞాన వేదిక(తెలంగాణ)

జవాబులు: **రాయగలరా:** 1.Swan 2. Monkey 3. Rat 4. Snake 5. Owl 6. Donkey దాగిన పదం: Season **కవలలేరి:** a, c **చిలిపిప్రశ్న:** అసలు కోడి పుంజు గుడ్డే పెట్టదుగా!

సుడోకు:

2	5	1	4	3	9	7	8	6
8	4	6	1	5	7	9	2	3
9	7	3	8	6	2	4	5	1
4	2	9	7	8	1	6	3	5
3	1	8	5	9	6	2	4	7
5	6	7	2	4	3	1	9	8
7	8	4	6	2	5	3	1	9
6	9	2	3	1	8	5	7	4
1	3	5	9	7	4	8	6	2

మా చిరునామా: హాయ్‌బుజ్జీ విభాగం, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా 501 512 email : hai@eenadu.net



సెప్టెంబరు 1న శాంతి ర్యాలీ, ధర్మదీక్ష

సంగారెడ్డి మున్సిపాలిటీ: నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలని కోరుతూ సెప్టెంబరు 1న సామూహిక సెలవు దినం పాటించి శాంతి ర్యాలీ, ధర్మదీక్ష కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.ప్రవీణ్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక అతిథి గృహంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 1న ఉదయం 10 గంటలకు అతిథి గృహం నుంచి జిల్లా పాలనాధికారి కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ ధర్మదీక్ష చేస్తామని చెప్పారు. తమ ఆందోళనకు అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు మద్దతు ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరు ఆందోళనలో పాల్గొనాలని కోరారు. టీఎస్‌టీఎఫ్, టీటీయూ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ మాణయ్య, వేణుగోపాలస్వామి మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగుల ఆందోళనకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ సాబేర్‌అలీ, తెలంగాణ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రవణ్ కుమార్, టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య యాదవ్, తెలంగాణ పీఈటీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గయ్య, సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు రమేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీఎస్‌సీపీఎస్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: **ఆరాధన:** శతక శంఖారావం ముగింపు మహోత్సవం... 06-30: **అన్నదాత,** 07-00: **ఈటీవీ న్యూస్,** 07-30: **శుభమస్తు:** విద్యాగణపతి ప్రత్యేకత ఏమిటి? వ్యాపారం పెరగడానికి గణేశ శ్రీవాస్తురీత్యా ఏం చేయాలి?, 08-30: **టాలీవుడ్ టైమ్,** 09-00: **ఈనాడు సినిమా: పాడుతా తీయగా...** (వినీత్, హీరా).

మధ్యాహ్నం

12-00: **అభి'రుచి':** ఘుమ ఘుమలు 'వంకాయ బజ్జీ కూర', మీచేతి వంట 'పెసల పులావ్', 'మేథి క్యారెట్ ఫ్రై', జస్ట్ ఎ మినిట్ 'బేసిన్ బర్ఫీ' తయారు చేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు.., 01-00: **స్టార్ మహిళ** (మెగా గేమ్ షో), 02-00: **అభిషేకం** (డైలీ సీరియల్), 02-30: **అత్తారింటికి దారేది** (డైలీ సీరియల్), 03-00: **సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు** (విధి 2) (డైలీ సీరియల్), 03-30: **ఆడదే ఆధారం** (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: **వసంతం** (డైలీ సీరియల్), 04-30: **జీన్స్-2** (రిపీట్), 05-30: **ఆడాళ్ళా మజాకా:** రావులపాలెం అతివలు ఉత్సాహంగా పాల్గొన్న గేమ్ షో..., 06-00: **శ్రీ భాగవతం** (భక్తి రసాత్మక దృశ్య కావ్యం) (డైలీ సీరియల్), 06-30: **ఒకరికి ఒకరు** (డైలీ సీరియల్)

రాత్రి

07-00: **సావిత్రి** (డైలీ సీరియల్), 07-30: **మనసు మమత** (డైలీ సీరియల్), 08-00: **స్వాతిచినుకులు** (డైలీ సీరియల్), 08-30: **నా పేరు మీనాక్షి** (డైలీ సీరియల్), 09-00: **ఈటీవీ న్యూస్,** 09-30: **జబర్దస్త్:** మనసారా నవ్వుకోవడానికి మంచి సమయం..., 10-30: **జబర్దస్త్ జల్సాటైం...**

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్
మధ్యాహ్నం 12:00 జబర్దస్త్ రిమిక్స్
01:00 ఆనందోబ్రహ్మ రిపీట్
01:15 డిజె రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్
03:30 ఈ-జంక్షన్ రిపీట్
సాయంత్రం
04:30 ఎక్స్‌ప్రెస్ రాజా
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా
రాత్రి
07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 పోవే..పోరా
09:00 పటాస్
09:30 మైకేల్ మదన్ కామరాజు
09:45 ది బ్రేకప్ కన్సల్టెంట్
10:00 ఆనందోబ్రహ్మ
10:15 డిజె
10:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్
11:00 పటాస్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

★ మానస (ఉ.6:00, సా. 6.00, రా. 11.00)
★ డా. ఈటీవి (ఉ. 6:30, 11:00, మ. 3:30. రా. 7:30)
★ యోగమంత్ర (ఉ.7:00, సా.5:30, రా. 11:30)
★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ. 7:30, సా. 5:00, రా. 10:30)
★ అమృతం (ఉ.8:00, మ. 12:30, రా. 8:00)
★ హెల్దీ & టేస్టీ – (ఉ.8:30, మ. 01:00, రా. 8:30)
★ ఆరోగ్యమస్తు (ఉ.09:00, 10:30, మ. 3:00, రా. 09:00)
★ జీవనరేఖ చైల్డ్ కేర్ - (ఉ.09:30, మ. 2:00, సా. 04:00, రా. 7:00)
★ బాడీ మైండ్ & సోల్ - సుఖ జీవనం (ఉ.10:00, మ. 2:30, రా. 9:30).
★ విహారి (మ. 12:00, సా. 6:30, రా. 10:00)
★ హెల్దీ డయాబెటిక్ (మ. 1:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: మిస్ 420 (అశ్వని నాచప్ప, రాజ్‌కుమార్), 10-00: మార్నింగ్ షో: రాధా కల్యాణం (రాధిక, చంద్రమోహన్), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: పోకిరి రాజా (వెంకటేశ్, రోజా), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: ఖబడ్దార్ (సాయికుమార్, భావన), రాత్రి: 7-00: ఫస్ట్ షో: బుద్ధిమంతుడు (ఏఎన్నార్), 10-00: యువ దర్శకుడు హను రాఘవపూడితో గుర్తుకొస్తున్నాయి...

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - ఫ్రైడ్ స్ప్రింగ్ రోల్స్ & కాఫీ బీన్ అండ్ మూంగ్ స్ప్రౌట్స్ దోశ, ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో – ఎగ్ స్ప్రింగ్ రోల్స్ & కాఫీ బీన్ చికెన్ నగ్గెట్స్, ఉ.10.00: పిండివంటలు, ప్రసాదాలు – చిట్టి చెగోడీలు & పులిహోర, ఉ.11.00, రా.10.45: గోరు ముద్దలు – స్వీట్ పన్నీర్ బుర్జీ, ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ (డయాబెటిక్ రెసిపీ) – డైజెస్టివ్ డ్రింక్, ఉ.11.30, రా.8:00: గాయత్రీ గోల్డ్ "బాబాయ్ హోటల్" - గన్ పౌడర్ & ఇడ్లీ, మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా (తమిళనాడు క్యూసైన్) - డ్రై ఫ్రూట్స్ సుజీయాం, మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్ – రాగ్ లడ్డూ, మ.12.30, రా.8.45: "కౌ అండ్ కాఫ్" సూపర్ చెఫ్ - బ్రేక్‌ఫాస్ట్ ఉప్మా, మ.12.45: సూప్స్ & స్టార్టర్స్ - ప్రాన్స్ అండ్ బేబికార్న్ కట్‌లెట్, మ.1.00, రా.7.00: వావ్ ఏమి రుచి (మిక్స్డ్ క్యూసైన్) – లాంబ్ స్కివర్స్ & జింజర్ గార్లిక్ ఆసియన్, మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) - చికెన్ మిర్చి బజ్జీ, మ.1.45, రా.7.30: ట్రెండీ ట్రీట్స్ – పెరటి రుచులు, మ.2.15, రా.10.30: డిజైనర్ డిష్ – కోల్హాపూరి పన్నీర్, మ.2.30: చోటా షెఫ్ – చికెన్ చీజ్, మ.5.15: స్నాక్స్ - పన్నీర్ చీజ్ తవ రోటి.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 °, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ (రిపీట్), 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360 °, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **లాలిజో పాపాయి, సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ సిద్ధివినాయక స్వామి మందిరం, ప్రభాదేవి, ముంబయి, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం,07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360 °, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి (రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 °, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీసంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360 °, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ అష్టవినాయక దర్శనం, మహారాష్ట్ర, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: **లాలిజో పాపాయి,** 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి (రిపీట్), 06-00 ఘంటారావం, 06-30 జైకిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360 °, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

ఏ ఛానల్లో ఏముంది.. 31-08-2017

SVBC (TTD) — **ఉదయం:** 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం + నిత్య పూజలివిగో, 07-00 విష్ణుసహస్ర నామ స్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (తిరుప్పావడసేవ), 08-00 శతమానంభవతి, 08-30 పూజకు వేళాయే - దత్తాత్రేయుడు, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీత మాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 ప్రత్యేక వార్తలు - ఆముక్త మాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్ర నామామృతం, లైవ్‌డోలోత్సవం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 అన్నమయ్య పాటకు పట్టాభిషేకం (రీపీట్), **సాయంత్రం:** 04-30 క్షేత్రదర్శిని, 05-00 లైవ్ ఎస్.డి. సేవ + ప్రత్యేక వార్తలు, అళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాధం + శ్రీనివాస గద్యం + లక్ష్మీనరసింహ కరావలంబస్తోత్రం, 08-00 నేను - నాస్వామి, 08-30 ధర్మసోపానాలు - చాగంటి, 09-00 ఆలయదర్శనం - కర్ణాటక, 09-30 దేవీ సప్తశతి - సామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 మహాభారతం అశ్వమేధపర్వం.

భక్తి TV — **ఉదయం:** 06-00 సాయి హారతి, 06-30 సద్గురు స్తోత్రం, 7-00 అర్చన, 7-30 సాయి గీతామృతం, 08-00 గణపతి దర్శనం, 08-30 మహాగణపతిం (లైవ్), 09-00 సంపూర్ణ రామాయణం, 11-00 ధర్మసందే హాలు, **సాయంత్రం:** 04-30 గణపతి దర్శనం, 05-00 శ్రీగణేశస్తోత్రం, 05-30 సాయి గీతామృతం, 06-00 సద్గురు స్తోత్రం, 07-00 భక్తివిశేషాలు, **రాత్రి:** 07-30 అమృతకలశం, 08-00 మహాగణపతిం(లైవ్), 08-30 రామాయణ తరంగిణి, 09-00 జై..జై..గణేశా., 09-30 వినాయక వైభవం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తివిశేషాలు.

జీ తెలుగు — **ఉదయం:** 07-30 శుభమస్తు, 08-00 సినిమా: త్రిపుర, 11-00 కామెడి ఖిలాడీలు రిపీట్, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్ రష్, 01-00 బతుకు జట్కా బండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం రిపీట్, 03-30 వారెవా, **సాయంత్రం:** 04-00 కామెడి ఖిలాడీలు, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమ భాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 రామా సీతా.., **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్దమందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మీ, 08-30 పున్నాగ, 09-00 కళ్యాణ వైభోగం, 09-30 ముత్యాలముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 ఇన్‌స్పెక్టర్ కిరణ్, 11-00 సినిమా:పంచాక్షరి.

మా — **ఉదయం:** 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 మహాభారతం, 08-00 రాశి ఫలాలు - దిన ఫలం, 08-30 శ్రీవినాయక చరితం, 09-00 సినిమా: **రాజా రాణి, మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లికూతురు, 01-00 కుంకుమపువ్వు, 01-30 బిగ్ బాస్ రిపీట్, 03-00 సినిమా: **అందరివాడు, సాయంత్రం:** 05-30 ఒకె జాను, 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 చిన్నారి పెళ్లికూతురు, **రాత్రి:** 07-00 లక్ష్మీ కళ్యాణం, 07-30 అష్టాచమ్మా, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 మల్లీశ్వరి, 09-30 బిగ్ బాస్, 10-30 బిగ్ బాస్ రిపీట్.

జెమిని — **ఉదయం:** 06-00 టెలీ షాపింగ్, 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం రిపీట్, 08-30 నాటు వైద్యం, 09-00 సినిమా: ఇంగ్లీష్ పెళ్లాం ఈస్ట్ గోదావరి మొగుడు, **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్), 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 నాగిని 2 (రిపీట్), 03-00 సినిమా: వీడే, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 నాగిని-2, 08-00 నువ్వు నాకు నచ్చావ్, 08-30 శనీశ్వరుని దివ్య చరిత్ర, 09-00 నందిని, 09-30 అగ్నిపూలు, 09-30 సినిమా: జేమ్స్‌బాండ్.

పత్తిలో తెగుళ్ల నివారణ

మన రాష్ట్రంలో అత్యధిక విస్తీర్ణంలో సాగవుతున్న పంట పత్తి. దిగుబడులను ప్రభావితం చేసే చీడపీడలను సకాలంలో గుర్తించి సమగ్ర సస్యరక్షణ చర్యలను పాటిస్తేనే ఆశించిన లాభాలు వస్తాయని నర్సంపేట వ్యవసాయ సహాయ సంచాలకుడు తోట శ్రీనివాసరావు తెలిపారు.

బ్యాక్టీరియా నల్లమచ్చల తెగులు: ఈ తెగులు మొక్క వివిధ దశలలో వివిధ రూపాలలో కన్పిస్తుంది. ముందుగా ఆకులపై కోణాకారంలో నూనె రంగు మచ్చలు ఏర్పడి తర్వాత నల్లగా మారి మూడో దశలో ఆకుల ఈనెల ద్వారా తెగులు వ్యాపించి నల్లగా మారుతుంది. తెగులు ఉధృతి ఎక్కువైతే కొమ్మలకు కూడా వ్యాపించి కొమ్మలు నల్లగా మారి ఎండిపోతాయి. దీన్నే బ్లాక్ ఆర్మ్ అని పిలుస్తారు. ఈ తెగులు పూలకు, కాయలకు సోకినప్పుడు పరిపక్వం చెందకుండానే పండి రాలిపోతాయి.

నివారణ చర్యలు: తెగులు సోకిన మొక్కల భాగాలను తీసి నాశనం చేయాలి. కిలో విత్తనానికి 10 గ్రా. సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్‌తో విత్తనశుద్ధి చేయాలి. ఉధృతిని బట్టి 3, 4 సార్లు 15 రోజుల వ్యవధిలో 10 లీటర్ల నీటికి పోషామైసిన్ లేదా ప్లాంటామైసిన్ 1 గ్రా. కాపరాక్సీక్లోరైడ్ 30 గ్రా. కలిపి పిచికారి చేయాలి.



ఆకుపై బ్యాక్టీరియా తెగులు మచ్చలు

వేరుకుళ్లు తెగులు: భూమిలో తేమ అధికంగా ఉన్నప్పుడు ఈ తెగులు అన్ని దశల్లో కనపడుతుంది. అర్ధంతరంగా మొక్క ఎండిపోవడం ఈ తెగులు లక్షణం. ఒక్క రోజులోనే మొక్క ఎండిపోతుంది. తెగులు సోకిన మొక్కలు గుంపులు గుంపులుగా ఎండిపోతాయి. మొక్కలోని అన్ని భాగాలు పైనుంచి కిందకు వాడిపోయి వేలాడుతూ ఉంటాయి. తెగులు సోకిన మొక్కలను తేలికగా పీకేయవచ్చు. ఎదిగిన మొక్కలు వాడిపోయి పసుపుబారి రాలిపోతాయి.

నివారణ చర్యలు: పంటమార్పిడి పాటించాలి. తెగులు సోకిన మొక్కలను పీకి నాశనం చేయాలి. కిలో విత్తనానికి 2 గ్రా. కార్బండిజమ్ లేదా 10 గ్రా. ట్రైకోడెర్మావిడితో విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలి. కాపరాక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. సిఫార్సు మేరకు పొటాష్ ఎరువులు వేయాలి.

వడలు తెగులు: ఈ తెగులు పత్తి అన్ని దశల్లో కన్పిస్తుంది. ఎదిగిన మొక్కలలో పుష్పించే దశలో ఈ తెగులు ఎక్కువగా ఉంటుంది. తెగులు సోకిన మొక్కలు ఆకులు వాడిపోయి, ఈనెల మధ్య భాగం పసుపురంగుకు మారుతుంది. ఆ తర్వాత ఎర్రబారుతుంది. కాండాన్ని చీల్చి చూస్తే నల్లని బూజుతో చారలు కన్పిస్తాయి.

నివారణ చర్యలు: పంటమార్పిడి చేయాలి. తెగులు సోకిన మొక్కలను పీకేయాలి. సిఫారసు చేసిన మోతాదులో పొటాష్ ఎరువులను వాడాలి. కిలో విత్తనానికి 2 గ్రా. కార్బండిజమ్ లేదా 10 గ్రా. ట్రైకోడెర్మావిడితో విత్తనశుద్ధి చేయాలి. కాపరాక్సీక్లోరైడ్ 3 గ్రా. లేదా కార్బండిజమ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి తెగులు సోకిన మొక్కల మొదళ్ల చుట్టూ తడపాలి.

– న్యూస్‌టుడే, ఖానాపురం

వరిలో జింకు లోపం

వివిధ ప్రాంతాల్లో సాగుచేస్తున్న పైర్లలో ప్రస్తుతం జింకు ధాతులోపం కనపడుతోంది. నల్లరేగడి నేలలు, క్షారభూములు, సున్నం అధికంగా ఉన్ననేలలు, మురుగునీరు నిల్వఉండే భూములు, వరుసగా వరిపంట సాగుచేసే నేలల్లో జింకు లోపం ఉంటుంది. ఈ లోపాన్ని సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలి.

లక్షణాలు: జింకులోపం ఉన్న వరిలో పైనుంచి 3 లేదా 4 ఆకులో స్పష్టంగా కనిపిస్తుంది. మధ్యఈనె ఆకుపచ్చ రంగును కోల్పోయి పసుపు వర్ణంగా మారి ఆకు చివర్లు మామూలు ఆకుపచ్చ రంగులోనే ఉంటాయి. ఒకోసారి ఈ లక్షణాలు నాటిన 2-4 వారాల మధ్య కనిపిస్తాయి. ఆకు చివర్లలో మధ్య ఈనెకు ఇరుపక్కల తుప్పు లేక ముదురు ఇటుక రంగులాంటి చిన్న మచ్చలు కనిపించవచ్చు. ఈ మచ్చలన్నీ కలిసిపోయి ఆకంతా వ్యాపించవచ్చు. ఈ లక్షణం దుబ్బుల మొదళ్లలోని ముదురు ఆకులమీద సాధారణంగా కనిపిస్తుంది. మురుగునీరు పారుదల లేని భూముల్లో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. జింకులోపం ఉన్న ఆకులు చిన్నవిగా, నూలు కండెల ఆకారం కలిగి పెళుసుగా ఉండి, వంచగానే శబ్దంచేస్తూ విరిగిపోతాయి.

నివారణ: ప్రతి మూడు పైర్లకు ఎకరానికి 20 కిలోల జింకు సల్ఫేటును నాటేముందు వేసి జింకులోపాన్ని నివారించవచ్చు. చవుడు భూముల్లో ఎకరానికి 40 కిలోల జింకు సల్ఫేటు వేయాలి. జింకులోపం పైరుమీద గమనించగానే 2 గ్రా. జింకు సల్ఫేట్‌ను లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో 2,3 సార్లు పిచికారీ చేయాలి.



- అన్నదాతలకు అందుబాటులో రైతు భవనాలు
- జిల్లాలో 84 చోట్ల ఏర్పాటుకు ప్రణాళికలు
- భూముల అన్వేషణలో రెవెన్యూ యంత్రాంగం

సాగు సమస్యలకు చెల్లు!

న్యూస్‌టుడే, మనూరు

ప్రభుత్వం తాజాగా రైతు భవనాలను తెరపైకి తెచ్చింది. రైతుల ప్రయోజనం కోసం గ్రామస్థాయి నుంచి సంఘాలను ఏర్పాటు చేస్తూనే వ్యవసాయ విస్తరణాధికారి పరిధిలో రైతు భవనాలను నిర్మించాలని నిర్ణయం తీసుకుంది. దీంతో జిల్లా యంత్రాంగం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతోంది. ఇప్పటికే 5వేల ఎకరాలకో ఏఈవోలను నియమించిన ప్రభుత్వం అదే పరిధిలో సదరు భవనాలుండాలని ఆదేశాలు ఇవ్వడం గమనార్హం.

అర ఎకరంలో..

జిల్లాలో 459 గ్రామ పంచాయతీలుండగా వ్యవసాయ డివిజన్లు ఐదు ఉన్నాయి. సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్, పటాన్‌చెరు, జోగిపేటలున్నాయి. 5వేల ఎకరాలకో క్లస్టర్‌ను ఏర్పాటు చేయగా ఒక్కో రైతు భవనానికి రూ.15 లక్షలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు అనువైన అర ఎకరం స్థలాన్ని గుర్తించాలని వ్యవసాయాధికారులకు ఆదేశించారు. గతంలో ప్రభుత్వ భూముల గుర్తించేందుకు సర్వే చేయగా భూములను ఇంకా స్వాధీనం చేసుకోలేదు. ఈ క్రమంలో ఎక్కడ స్థలం కేటాయించాలనేది అధికారులకు అంతుబట్టడం లేదు. కొన్ని క్లస్టర్లలో భూములుండగా చాలా చోట్ల నిర్దేశిత భూమి కన్నా తక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో పక్కన భూమిని కొనుగోలు చేయడమా.. ఉన్న చోటే భూమిని కేటాయించడమా అని సమాలోచనలు చేస్తున్నారు. 3-4 గ్రామాలకో క్లస్టర్‌ను ఏర్పాటు చేయగా సదరు గ్రామాల్లో భూములను కేటాయించాలని భావిస్తున్నారు.



పంట సాగులో రైతన్న

ఇదిగో ఇలా..

జిల్లా వ్యాప్తంగా రైతు భవనాలను నిర్మించేందుకు వ్యవసాయ శాఖ క్లస్టర్ల ఎంపిక పూర్తి చేసింది. జిల్లాలో 5.15 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణముండగా 84 క్లస్టర్లను ఏర్పాటు చేసింది. 84 మంది ఏఈవోలకు బాధ్యతలు అప్పజెప్పారు. మొదటి విడతగా మండల కేంద్రాలలో భవనాలు నిర్మించనున్నారు. ఒక్కో భవనానికి ప్రభుత్వం రూ.15 లక్షలు మంజూరు చేసింది. వ్యవసాయాధికారులు అదే పనుల్లో నిమగ్నమయ్యారు. మిగతా క్లస్టర్లకు రెండవ విడతలో భవనాలు నిర్మించనున్నారు.

సమస్యల పరిష్కారం



నారాయణ, మాయికోడ్

క్లస్టర్లకు ఒక్కటి చొప్పున రైతు భవనాలు నిర్మిస్తే గ్రామంలోని రైతుకు ఎదురయ్యే సమస్యలు పరిష్కారమవుతాయి. వ్యవసాయానికి సంబంధించి అధికారి అక్కడే ఉంటాడు. సమస్యల్ని ఎప్పటికప్పుడు చర్చించుకోవచ్చు. ఇక రైతుకు ఏలాంటి ఇబ్బందులు ఉండవు.

రైతు భవనం ఎంతో ప్రయోజనం..

సాగుకు దన్నుగా నిలిచేలా రైతు భవనం నిర్మించనున్నారు. ఏ రైతు పట్టణాలకు వెళ్లకుండా సమీప ప్రాంతంలోనే అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా భవనం వేదికగా నిలువనుంది. రైతులందరినీ ఒక్కతాటిపైకి తీసుకొచ్చి వారికి అధికారుల ద్వారా అన్ని రకాల సహాయ సహకారాలు అందించనున్నారు. రైతులకు పంట సమగ్ర విధానంపై శిక్షణనిస్తూ అధిక దిగుబడులు సాధించేలా చర్యలు తీసుకోనున్నారు. ఆధునిక సాగు పద్ధతులు, చీడపీడల నివారణ, సంప్రదాయ విధానానికి విముక్తి కల్పిస్తూ.. మేలు రకమైన విత్తనాల ఎంపిక, తయారీ, సాగు మెలకువలతో అధిక దిగుబడులు సాధించడం, గిట్టుబాటు ధరలు పొందేలా వ్యవసాయశాఖ, అనుబంధ విభాగాల నుంచి ఎప్పటికప్పుడు సూచనలందనున్నాయి. రైతు సమావేశ మందిరాలుగా, గోడౌన్లుగా, విత్తన, ఎరువులు, ధాన్యం, నిల్వ కేంద్రాలుగా వినియోగించుకోనున్నారు.

రైతు భవనం కోసం మనూరులో సేకరించిన స్థలం ఇదే



వెంటనే నిర్మించాలి: విశ్వనాథ్, గూడూర్

మండల కేంద్రాలకు కాకుండా క్లస్టర్లల్లోని గ్రామాల్లో భవన నిర్మాణం ప్రారంభించాలి. మండల కేంద్రాలలో వ్యవసాయ భవనం ఉంటుంది. అధికారులు అక్కడికి వస్తుంటారు. ఏవైన సమస్యలు వస్తే వారితో చర్చించడానికి అవకాశం ఉంటుంది. ముందుగా క్లస్టర్లలోనే భవన నిర్మాణాలు ఏర్పాటు చేయండి.

పంటలకు గిట్టుబాటు ధరలు: లింగప్ప, బాదల్‌గామ్

అధికారుల నిఘా ఉండటంతో పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు వస్తాయి. అదేవిధంగా నకిలీ విత్తనాల బదులుగా మేలు రకమైనవి అందుతాయి. పంటల సాగు, సస్యరక్షణ తదితరాలన్నీ పరిష్కారమవుతాయి. ప్రభుత్వం భవనాలను వెంటనే నిర్మించేలా చర్యలు తీసుకోవాలి.

అనుకూల స్థలాలను సేకరిస్తున్నాం



శైలజ జిల్లా వ్యవసాధికారిణి

జిల్లాలో 84 క్లస్టర్లు ఉండగా 84 క్లస్టర్లలో రైతు భవనాలు నిర్మించనున్నాం. మొదటి విడతగా మండల కేంద్రాల్లో నిర్మించాలని ఆదేశాలు వచ్చాయి. అందుకు స్థలాలను సేకరిస్తున్నాం. సగానికిపైగా స్థలాలను సేకరించాం. మిగతా వాటికోసం రెవెన్యూతో మాట్లాడి భూముల్ని సేకరిస్తాం.

ఇంటిబాట పట్టిన వ్యవసాయ విద్యార్థులు

హత్నూర: హత్నూర మండలం తుర్కలఖానాపూర్ గ్రామ శివారుల్లోని రత్నపురి వ్యవసాయ పాలిటెక్నిక్‌లో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అనకాపల్లి సహస్ర(17) రెండు రోజులక్రితం వసతిగృహంలో ఆత్మహత్య చేసుకోవడంతో సహ విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. పాలిటెక్నిక్ కళాశాలలో మొత్తం 920 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అందులో 270 మంది వసతి గృహంలో ఉంటున్నారు. వీరిలో 190 మంది అబ్బాయిలు, 72 మంది అమ్మాయిలు ఉన్నారు. సహ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడటంతో వసతి గృహంలో ఉంటున్న బాలికలు ఇంటిముఖం పట్టారు. ఇక్కడ జరిగిన ఘటనతో తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఇంటికి తీసుకపోవడంతో అమ్మాయిలు ఉంటున్న కేంద్రం మూతపడింది. ఈ విషయమై ఏవో భిక్షపతి మాట్లాడుతూ విద్యార్థులు భయపడుతుండడంతో తామే తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి వారం రోజుల పాటు ఇంటికి పంపించామని చెప్పారు.

విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని భాజపా జిల్లా అధ్యక్షుడు కాసాల బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏవో కృష్ణారెడ్డికి బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ... తెరాస ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఒకతీరు.. వచ్చిన తర్వాత మరో తీరు వ్యవహరిస్తోందని విమర్శించారు. అధికారికంగా నిర్వహించాలని అధికార పార్టీపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు తమ పార్టీ ప్రయత్నం చేస్తోందన్నారు. సెప్టెంబరు 17న భాజపా ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయంపై జాతీయ జెండాలు ఆవిష్కరించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, జిల్లా అధ్యక్షుడు నర్సింహ్మాగౌడ్, నాయకులు జయరాం, కృష్ణ, సత్యానారాయణ, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు విష్ణువర్ధన్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న భాజపా జిల్లా అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, నాయకులు